# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 16 మే 2026 | www.balagamtv.com | పేజీలు 7


## ప్రధాని పొదుపు సూత్రంలో సుప్రీం

### వారానికి రెండ్రోజులు వర్చువల్ విచారణ

న్యూఢిల్లీ,మే15(ఆర్ఎన్ఎ): పశ్చిమాసియాలో సంక్షోభం కారణంగా ఇంధనం వాడకాన్ని తగ్గించుకోవాలని దేశ ప్రజలకు ప్రధాని మోదీ సూచించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సుప్రీం కోర్టు కూడా పొదుపు చర్యలు చేపట్టింది. వారానికి రెండు రోజులు సోమ, శుక్రవారం పూర్తి స్థాయిలో వర్చువల్ విధానంలో విచారణ జరపాలని నిర్ణయించింది. అంతేకాదు, మంగళవారం నుంచి గురువారం వరకు హైబ్రిడ్ విధానంలో విచారణ చేపడతామని, కక్షిదారులు వీలును బట్టి ఎలాగైనా పాల్గొనవచ్చని పేర్కొంది. ఈ మేరకు సుప్రీం కోర్టు రిజిస్ట్రీ సర్క్యులర్ జారీ చేసింది. కొత్త ఏర్పాట్ల ప్రకారం.. ఇంధనం పొదుపులో భాగంగా న్యాయమూర్తులు కూడా కార్ పూలింగ్ ను ప్రోత్సహించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు సుప్రీం కోర్టు వెల్లడించింది. రోజువారీ కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకం లేకుండా చూసుకో వడంతో పాటు ప్రతి రిజిస్ట్రీ లేదా సెక్షన్‌లోని 50 శాతం సిబ్బందికి వారానికి గరిష్ఠంగా రెండు రోజులు వర్క్-ఫ్రం-హోమ్‌కు అనుమతించాలని సూచించింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరుగుతుండటంతో ఇంధనాన్ని పొదుపుగా వినియోగించుకోవాలని, అనవసర ఖర్చులు తగ్గించుకోవాలని ప్రధాని మోదీ ఇటీవల పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఇప్పటికే పలువురు ముఖ్యమంత్రులు, ప్రముఖులు భద్రతా శ్రేణిలో వాహనాలను తగ్గించుకుంటున్నారు.

# పెట్రో, డీజిల్ ధరల పెరుగుదల

### లీటర్‌పై కనీసంగా రూ.3 పెంపు

### ధరలు పెంచుతూ ఆయిల్ కంపెనీల నిర్ణయం




**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

ఊహించినట్లుగానే.. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటరు పెట్రోల్‌పై సగటున రూ.3, డీజిల్‌పై రూ.3 పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న సంక్షోభం నేపథ్యంలో.. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. అయినప్పటికీ.. ప్రభుత్వరంగ చమరు కంపెనీలు దాదాపు 11 వారాల పాటు ఇంధన ధరలను స్థిరంగా ఉంచాయి. అయితే, అవి తీవ్ర ఆర్థికఒత్తిళ్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. లీటరుకు రూ.3 పెంచి వాహనదారులపై కొంత భారాన్ని మోపాయి. 2022 ఏప్రిల్ నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు దాదాపు మారలేదు. అయితే, లోక్‌సభ ఎన్నికలకు ముందు 2024 మార్చిలో

మిగితా 2వ పేజీలో

# 2034 వరకు నేనే ముఖ్యమంత్రిని

## ఆ తరవాత జాతీయ రాజకీయాల్లోకి వెళతా



- రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తా
- రాహుల్ తరవాత సెకండ్ ప్లేస్ ఆక్రమిస్తా
- సిఎం రేవంత్ రెడ్డి మరోమార్ సంచలన వ్యాఖ్యలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 2034లో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించి జాతీయ రాజకీయాల్లోకి వెళ్తానని చెప్పారు. అప్పటి వరకు తానే సీఎంగా ఉంటానన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన లక్ష్యమని చెప్పారు. జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి రాహుల్ తర్వాతి స్థానంలో ఉంటానని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు. ఆయనకు ప్రధాని కావాలనే కోరిక లేదని.. ఆ పదవికి పోటీ పడాలని తాను ఒప్పించానని రేవంత్ చెప్పారు. గాంధీ కుటుంబానికి దేశం పట్ల విశ్వాసం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు. తన గీత తాను దాటనని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ వేదికగా సీఎం మాట్లాడారు. టీడీపీలో పదేళ్లు పనిచేశానని.. సీఎం చంద్రబాబు ఇప్పటికి తనను గౌరవిస్తారని ప్రస్తావించారు. పార్టీని వదిలిపెట్టిన తర్వాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదని తెలిపారు.. పార్టీని వదిలిపెట్టే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు చెప్పి వచ్చానని గుర్తుచేశారు.. కాంగ్రెస్‌ను దేశంలో అధికారంలోకి తేవాలని రాహుల్ గాంధీకి లక్ష్యం ఉందని...కాని ప్రధాని కావాలన్న లక్ష్యం లేదని స్పష్ట చేశారు. వికారాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని పదవి తీసుకోవాలని తానే రాహుల్ గాంధీకి చెప్పి ఒప్పించానని ప్రస్తావించారు. ఇప్పుడు జనం స్విగ్గి పాలిటిక్స్ కోరుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్ గాంధీనే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముందు ప్రకటించి తర్వాత ఇండియా కూటమిని ఒప్పిస్తామని తెలిపారు. ఇండియా కూటమి తరుపున ఒక పాలసీ డాక్యుమెంటును తీసుకువచ్చి ప్రజలను తీర్పు ఇవ్వమని కోరతామని అన్నారు. 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తారని చెప్పుకొచ్చారు.. 2034 వరకు తాను తెలంగాణలోనే ఉంటానని.. ఈ ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. పదిశాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రినని చెప్పుకొచ్చారు. 2034 తర్వాత తాను ముఖ్యమంత్రిగా ఉండనని.. తర్వాత తరానికి అవకాశం ఇస్తానని తెలిపారు. దేశానికి కూడా సేవలందిస్తా అని.. తన అనుభవాన్ని దేశం కోసం పంచుతానని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

### తెలంగాణ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తాం : సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లే క్రమంలో ఎక్కడైనా పొరపాట్లు జరిగితే వాటిని సవరించుకుంటూ లక్ష్యాన్ని చేరుకునేందుకు నిబద్ధతతో పనిచేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు.ప్రభుత్వంలో సంక్షేమం నిరంతర ప్రక్రియగా ఉండాలని, అభివృద్ధి మాత్రం దీర్ఘకాలిక ప్రణాళికలతో సాగాలని పేర్కొన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు 2047 నాటికి తెలంగాణ లక్ష్యాలపై ప్రభుత్వ దృష్టి కేంద్రీకృతమైందన్నారు.

"ప్రజాప్రతినిధిగా నా ఆలోచనల్లో స్పష్టత ఉంది. నా ఆలోచనలపై కొందరికి భిన్నాభిప్రాయాలు

మిగితా 2వ పేజీలో

## పెట్రో ధరల పెంపు అనివార్యం

### కాంగ్రెస్, బిఆర్ఎస్‌లవి పనీపాటలేని విమర్శలు

### మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

పెట్రోల్, డీజిల్ ధరల పెంపును అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు రాజకీయంగా వాడుకొంటున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ రెండు పార్టీలకు పనీపాట లేదని.. అందువల్లే ఈ తరహా ఆరోపణలు చేస్తున్నాయంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దయచేసి ఆ యా పార్టీల నేతల మాటలు విని మోసపోవద్దంటూ ప్రజలకు స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెంపుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. దేశవ్యాప్తంగా పెట్రోలు ధరలు పెరిగాయన్నారు. ఈ పెంచిన ధరలు శుక్రవారం ఉదయం నుంచి అమల్లోకి వచ్చాయని చెప్పారు. అమెరికా, ఇరాన్ యుద్ధ ప్రభావంతోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు అనివార్య మైందన్నారు. అంతేకానీ ఇది ప్రజల మీద భారం వేసేందుకు కాదన్నారు. క్రూడాయిల్ దిగుమతికి భారీగా ఖర్చు అవుతుందని వివరించారు. అందుకోసమే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో అమెరికా, జర్మనీ, జపాన్ తదితర దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సోదాహరణగా వివరించారు. పెట్రోల్, డీజిల్ లీటర్ ధరలు రూ.3కు పైగా పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. వీటి ధరలు పెంచడం వల్ల ప్రజలపై అదనపు భారం పడుతుందంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పైవిధంగా స్పందించారు.

## ధరల పెంపుపై భగ్గుమన్న కాంగ్రెస్

### ఇక సైకిలే దిక్కన్న అఖిలేశ్ యాదవ్

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను లీటర్‌కు రూ.3 చొప్పున పెంచుతూ ఆయిల్ కంపెనీలు కీలక నిర్ణయం తీసుకోవడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా తప్పుబట్టాయి. ఈ క్రమంలో ప్రధాని మోదీపై కాంగ్రెస్ ఘాటు విమర్శలు చేసింది. 'ద్రవ్యోల్బణ వ్యక్తి మోదీ. ఈరోజు మరోసారి ప్రజలపై కొరడా ఝుళిపించారు' అంటూ కాంగ్రెస్ తన అధికారిక ఎక్స్ ఖాతా వేదికగా విమర్శలు చేసింది. పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరల పెంపును ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికలకు ముడిపెట్టింది. ఎన్నికలు ముగిసిన వెంటనే మోదీ తన వసూళ్లు ప్రారంభించారంటూ ఆరోపించింది. ఎన్నికల తర్వాత ఇంధన ధరలు పెరుగుతాయన్నది ఊహించినదే అంటూ తృణమూల్ కాంగ్రెస్ దుయ్యబట్టింది. ప్రజలపై భారాన్ని తగ్గించేందుకు పెట్రోల్, డీజిల్‌పై విలువ ఆధారిత పన్ను తగ్గిస్తుందా అంటూ పశ్చిమబెంగాల్‌లో కొత్తగా కొలువుదీరిన భాజపా నేతృత్వంలోని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కేంద్రం ఇంధన ధరలు పెంచడంపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ వ్యంగ్యంగా స్పందించారు. 'మీరు ముందుకుసాగాలంటే.. సైకిల్ ఒక్కటే ఆప్షన్' అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. దీనికి సైకిల్ తొక్కుతూ ఉన్న క్యారికేచర్‌ను పంచుకున్నారు. 'సైకిల్ పైనే ప్రయాణం కొనసాగిస్తామని ఇదివరకే చెప్పాం' అని దానికి ఆయన క్యాప్షన్ పెట్టారు. కాగా.. సమాజ్‌వాదీ పార్టీ గుర్తు సైకిల్ కావడం గమనార్హం. ఇక, పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. దీంతో ప్రభుత్వరంగ చమురు కంపెనీలపై ఆర్థిక ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. ఈక్రమంలోనే లీటరు పెట్రోల్‌పై సగటున రూ.3, డీజిల్‌పై రూ.3 పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి.

# ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర పక్రియ

- జూన్ 2న ఆదిలాబాద్ నుంచి రెండో విడత ప్రారంభం
- గూడులేని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు
- జాయింట్ సర్వే తో భూ సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం
- పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పేద కుటుంబానికి సొంత ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, అది వారి ఆత్మగౌరవానికి, భద్రమైన భవిష్యత్తుకు ప్రతీకని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంతరెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మంజూరును నిరంతరం కొనసాగించే పక్రియగా చేపట్టిందన్నారు. గూడులేని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు సమకూర్చడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇవ్వని విధంగా ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయంతో పేదల ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టి తెలంగాణా ప్రభుత్వం దేశానికి తలమానికంగా నిలిచిందన్నారు. రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా శుక్రవారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు, హౌసింగ్ డిపార్ట్ మెంట్ అధికారులతో మంత్రిగారు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఖమ్మం ఇన్ ఛార్జి మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రులు అనసూయ సీతక్క, కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్, పార్లమెంటు సభ్యులు వేం నరేందర్ రెడ్డి, పి.బలరాం నాయక్, కడియం శ్రీహరి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరును విజయవంతంగా పూర్తి చేసి లక్షలాది పేద కుటుంబాల సొంత ఇంటి కలలను నెరవేర్చామని తెలిపారు. 3 లక్షలకు పైగా ఇండ్లను మంజూరు చేయగా, దాదాపు 2.90 లక్షల వరకు గ్రౌండింగ్ కాగా, ఇందులో ఇప్పటికే సుమారు 50 వేల గృహ ప్రవేశాలు కూడా జరిగాయని, అలాగే మరో రెండు లక్షలకు పైగా ఇండ్ల నిర్మాణం పనులు వివిధ దశల్లో ఉన్నాయని మరో రెండు నెలల్లో పూర్తి అవుతాయని తెలిపారు. నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేయగా , ఐటిడిఎ ప్రాంతాల్లోని నియోజకవర్గాలకు అదనంగా ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. వచ్చే నెల రెండో తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడత ఇండ్ల మంజూరు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఇది ఇంతటితో ఆగిపోదని అర్హులైన ప్రతి లబ్దిదారునికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే వరకు మూడవ, నాలుగవ విడతలుగా ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందన్నారు.

మిగితా 4వ పేజీలో

## బండి భగీరథ్‌కు ముందస్తు బెయిల్ నిరాకరణ!

### ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేం: హైకోర్టు స్పష్టీకరణ

### మధ్యంతర రక్షణకూ నో.. వచ్చే వారానికి విచారణ వాయిదా



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కేంద్ర మంత్రి, భాజపా నేత బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పేట్‌బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో ఈ దశలో ముందస్తు బెయిల్‌పై ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని రాష్ట్ర హైకోర్టు తేల్చి చెప్పింది. అలాగే ఈలోపు అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులిచ్చే అంశంపై నిర్ణయాన్ని వచ్చే వారం వెలువరిస్తామని ప్రకటించింది. పోక్సో కేసులో ముందస్తు బెయిలు మంజూరు చేయాలంటూ బండి భగీరథ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ టి.మాధవీదేవి శుక్రవారం రాత్రి 9 గంటల నుంచి దాదాపు అర్ధరాత్రి 12 గంటల వరకు సుదీర్ఘ విచారణ చేపట్టారు.

మిగితా 4వ పేజీలో

## మే 26న కేరళకు రుతుపవనాలు!

### వేసవి తాపం నుంచి త్వరలోనే ఉపశమనం.. ఐఎండీ చల్లని కబురు

### ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

భానుడి భగభగలతో అల్లాడిపోతున్న దేశ ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) చల్లని కబురు అందించింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు మే 26 నాటికి కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని అంచనా వేసింది. అయితే వాతావరణ పరిస్థితుల దృష్ట్యా దీనికి నాలుగు రోజుల అటు ఇటుగా అంటే.. మే 22 నుంచి మే 30 మధ్యలో ఎప్పుడైనా రుతుపవనాలు ప్రవేశించవచ్చని వాతావరణ కేంద్రం వివరించింది. సాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశిస్తాయి. కానీ ఈసారి కాస్త ముందుగానే వస్తుండటంతో దేశవ్యాప్తంగా అన్నదాతలు ఖరీఫ్ సాగు పనులకు సిద్ధమవుతున్నారు. గతేడాది రుతుపవనాలు మే 24న ప్రవేశించినట్లు ఐఎండీ గుర్తుచేసింది.

**రాబోయే 24 గంటల్లో అండమాన్‌లోకి..**

రాబోయే 24 గంటల్లో దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతాల్లోకి రుతుపవనాలు విస్తరించడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. "భారత ప్రధాన భూభాగంలోకి నైరుతి రుతుపవనాల విస్తరణ అనేది కేరళలో వాటి ఆగమనంతో గుర్తిస్తాం. వేడి, పొడి వాతావరణం నుంచి వర్షాకాలంలోకి జరిగే మార్పును సూచించే ఒక ముఖ్యమైన సూచిక ఇది. రుతుపవనాలు ఉత్తరం వైపుగా విస్తరిస్తున్న కొద్దీ, ఆయా ప్రాంతాల్లో వేసవిలో ఉండే తీవ్రమైన ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం లభిస్తుంది" అని ఐఎండీ పేర్కొంది.

ఈ ఏడాది రుతుపవన కాలంలో భారతదేశంలో సాధారణ స్థాయి కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ స్పష్టం చేసింది. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడుతున్న 'ఎల్ నినో' పరిస్థితులే ఇందుకు ప్రధాన కారణమని వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు.

92 శాతమే నమోదు: ఈ ఏడాది జూన్-సెప్టెంబర్ సీజన్‌లో దేశవ్యాప్తంగా సగటున 92 శాతం వర్షపాతం మాత్రమే నమోదయ్యే అవకాశం ఉంది.

80 సెం.మీ వర్షపాతం: ఈ రుతుపవన కాలంలో దేశంలో సాధారణంగా సుమారు 80 సెం.మీ వర్షపాతం కురిసే ఛాన్స్ ఉంది. కాగా, ఈ కాలానికి సంబంధించిన దీర్ఘకాలిక సగటు (1971-2020 మధ్య కాలం) 87 సెం.మీగా ఉంది.దీనివల్ల దేశంలోని వ్యవసాయం, నీటి వనరులు, పర్యావరణంపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది.

**దేశ ఆర్థిక వ్యవస్థకు 'జీవనాడి'**

నాలుగు నెలల పాటు సాగే నైరుతి రుతుపవన కాలాన్ని దేశ వ్యవసాయ ఆధారిత ఆర్థికవ్యవస్థకు జీవనాడిగా పిలుస్తారు. దేశానికి లభించే వార్షిక వర్షపాతంలో దాదాపు 70 శాతాన్ని ఈ రుతుపవనాలే అందిస్తాయి. జలాశయాలు నిండటానికి, భూగర్భ జలాలు పెరగడానికి ఇది అత్యంత కీలకం. మన దేశంలో 50% కి పైగా నికర సాగుభూమికి ఇప్పటికీ వర్షపాతమే ప్రధాన ఆధారం. దేశం మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో ఈ సాగు భూమి నుంచే ఏకంగా 40% దిగుబడి వస్తుంది. అందుకే భారత ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంలో నైరుతి రుతుపవనాలు కీలక పాత్ర పోషిస్తాయి.

### "ప్రపంచ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో

# టిమ్స్ ఏర్పాటు చేశాం"




### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రిని సందర్శించిన కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా అధునాతన వైద్యం అందించాలనే సంకల్పంతోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రి ఎదురుగా నిర్మాణం పూర్తి చేసుకున్న వెయ్యి పడకల టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ఆయన సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

గతంలో గాంధీ, ఉస్మానియా వంటి ప్రభుత్వ ఆసుపత్రులే ప్రధాన ఆధారమైతే, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అత్యాధునిక టిమ్స్ ఆసుపత్రులు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఎయిమ్స్ స్థాయి వైద్యం అందించేలా టిమ్స్‌ను రూపకల్పన చేశామని, సనత్‌నగర్ టిమ్స్ కోసం 22 ఎకరాల విస్తీర్ణాన్ని వినియోగించామని తెలిపారు. అత్యాధునిక టెక్నాలజీ, అంతర్జాతీయ ప్రమాణాలతో ఆసుపత్రి నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులకు పోటీగా పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం టిమ్స్‌ను తీసుకువచ్చిందన్నారు. హైదరాబాద్‌లో సనత్‌నగర్,

## నాంపల్లి రైల్వే స్టేషన్‌లో భారీ అగ్నిప్రమాదం

### రెండు ఏసీ బోగీల్లో మంటలు

### ప్రయాణికులు లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ నాంపల్లి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం జరిగింది. నాలుగో ప్లాట్ ఫారంపై ఉన్న జైపూర్ వెళ్తున్న ప్రత్యేక రైలు ఏసీ బోగీలో మంటలు చెలరేగాయి. రైలు, బయలుదేరడానికి ముందుగా ప్లాట్‌ఫామ్‌పై ఆగివుండగా, దాని బీ1 బీ2 ఏసీ బోగిలలో మంటలు అకస్మాత్తుగా చెలరేగాయి. అదష్టవశాత్తూ, అప్పుడు బోగీలలో ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైరింజన్లతో అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. దెబ్బతిన్న బోగీలను రైలు నుండి వేరు చేశారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన వల్ల నాంపల్లి రైల్వే స్టేషన్‌లో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది.

ఈ ప్రమాదంపై సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ్ స్పందించారు. హైదరాబాద్ నుంచి జైపూర్‌కు వెళ్లే రైలు ప్లాట్‌ఫామ్‌పైకి వచ్చిన 10 నిమిషాల్లోనే బీ-1 ఏసీ కోచ్‌లో మంటలు చెలరేగి బీ-2 కోచ్‌కు వ్యాపించాయని చెప్పారు. రైల్వే సిబ్బంది వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు చేరుకుని మంటలు ఇతర బోగీలకు వ్యాపించకుండా బీ-1, బీ-2 కోచ్‌లను రైలు నుంచి వేరు చేసినట్టు వెల్లడించారు. ఈ ప్రమాదంలో బీ-1 బోగీ పూర్తిగా దగ్ధమవగా, బీ-2 బోగీ పాక్షికంగా కాలిపోయిందన్నారు. ప్రమాదం సంభవించిన సమయంలో ఆ బోగీల్లో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని తెలిపారు. ప్రమాదానికి గల అసలు కారణాలు ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన తర్వాత వెల్లడిస్తామన్నారు.

# భూగర్భజలాల సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు

**త్రాగు నీటి భద్రత పై ప్రత్యేక దృష్టి**

**నీటి లభ్యత పెరగడంతో పాటు వినియోగం పెరుగుతుంది**

**ఫ్లోరైడ్,నైట్రేట్ వంటి సమస్యాత్మక అంశాలపై ప్రత్యేక దృష్టి**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్**



భూగర్భ జలాల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు తాగునీటి భద్రత కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.ఫ్లోరైడ్, నైట్రేట్ వంటి సమస్యాత్మక అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు.శుక్రవారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్,గ్రౌండ్ వాటర్ డిపాక్ష్మి-టంక్ష్మి-మెంట్ డైరెక్టర్ లక్ష్మణ్ ,డిప్యూటి డైరెక్టర్ పి.జ్యోతికుమార్ తదితరులు పాల్గొన్నారు.ఈ

సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో భూగర్భ జలాల సంరక్షణ అన్నది అత్యంత ప్రాధాన్యతంశమని ఈ విషయంలో రైతులకు ప్రత్యేక అవగాహన కలిగించెందుకు అధికారులు చొరవ చూపాలని ఆయన సూచించారు. అదే సమయంలో నీటిని సమర్ధవంతంగా వినియోగించుకునేలా చూడడంతో పాటు వృధా గా పోయే నీటిని నియత్రించేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. తెలంగాణా రాష్ట్రంలో భూగర్భ జలాల లభ్యత పెరుగుతున్నప్పటికీ అదే స్థాయిలో నీటి వినియోగం పెరుగుతున్నందున నీటి వృధాను అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. 2024 తో పోల్చిచూసినపుడు 2025 లో జలాల వినియోగం 45.93 శాతం నుండి 46.86 శాతానికి పెరిగిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.భూగర్భ జలాల సంరక్షణ అనేది ఒక ఉద్యమంలా ప్రజల్లోకి టిదుకెళ్లాలని నీటి సంరక్షణలో ప్రతీ ఒక్కరిని భాగస్వామ్యం చేయాల్సిన ఆవశ్యకతను ఆయన అధికారులకు వివరించారు. అధికంగా భూగర్భ జలాల వినియోగం అవుతున్న ప్రాంతాలలో భవిష్యత్ అవసరాల దృష్ట్యా నియంత్రణ మీద దృష్టి సారించేయాలన్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టుకునెందుకు గాను ఇంకుడుగుంటల నిర్మాణాన్ని ఇబ్బడిముబ్బడిగా ప్రోత్సాహించాలని ఆయన చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భజలాల పరిమాణాలని నిరంతరం గుర్తించేందుకు వీలుగా 1,771 ఫిజోమిటర్లను వినియోగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.పైగా భూగర్భ జలాల నియంత్రణతో గ్రౌండ్ వాటర్ డిపాక్ష్మి-టంక్ష్మి-మెంట్ కు ఆదాయం లభిస్తుందన్నారు. పరిశ్రమలు, మైనింగ్ యూనిట్లు,అపార్టుమెంట్లు,ప్యాక్డ్ డ్రింకింగ్ వాటర్ యూనిట్లకు భూగర్భ జలాల వినియోగానికి అనుమతులు ఇవ్వడం ద్వారా వినియోగ చార్జీల రూపంలో 25.80 కోట్లు గడించినట్లు ఆయన తెలిపారు. జాతీయ హైడ్రాలోజి ప్రాజెక్టు అమలులో ఉత్తమ పనితీరు కనబర్చిన శాఖల్లో తెలంగాణా గ్రౌండ్ వాటర్ విభాగం ఒకటిగా గుర్తింపు పొందడం అభినందనీయమని, ఇకపై భూగర్భ జలాల నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కృత్రిమ మేధస్సు తో మరిన్ని సత్ఫాలితాలూ సాధించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అధిక వినియోగ ప్రాంతాల్లో భూగర్భ జలాల వినియోగంపై నియంత్రణలు కఠినతరం చేయడంతో పాటు, వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను మెరుగుపరచాలని, భూగర్భ జలాల వినియోగంపై శాఖల మధ్య సమన్వయంతో నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. ప్రతి జిల్లాలో జిల్లా స్థాయి భూగర్భ జలాల కమిటీల సమావేశాలను జిల్లా కలెక్టర్లు నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు. భూగర్భ జలాల వినియోగం, రీచార్జ్ పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. తాజా భూగర్భ జలాల అంచనాల్లో అధిక వినియోగ ప్రాంతాలుగా గుర్తించిన గ్రామాల వివరాలను జిల్లా యంత్రాంగానికి అధికారికంగా పంపించి, అక్కడ కొత్త బోర్‌వెల్ తవ్వకాలు మరియు అదనపు భూగర్భ జలాల వినియోగాన్ని నియంత్రించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.రాష్ట్రంలోని 16 జిల్లాల్లో భూగర్భ జలాల ఒత్తిడి అధికంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్ జిల్లాలోనే ఎనిమిది మండలాలు అధిక వినియోగ కేటగిరీలో ఉన్నాయని వెల్లడించారు. ఇసుక తవ్వకాల అనుమతులకు ముందు భూగర్భ జలాల శాఖతో తప్పనిసరిగా సంప్రదింపులు జరపాల్సిన అవసరంపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. భూగర్భ జలాల మట్టాన్ని మెరుగుపరచడానికి భూగర్భ జలాల శాఖ, నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్ శాఖ, పరిశ్రమల శాఖల మధ్య మరింత సమన్వయం అవసరమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక



**మే 18 -23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక వారోత్సవాలు**

**బ్రోషర్‌ను ఆవిష్కరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు**

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మే 18 నుంచి 23 వరకు తెలంగాణ వ్యాప్తంగా పర్యాటక వారోత్సవాలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రత్యేక బ్రోషర్‌ను పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక, భాషా సాంస్కృతిక, పురావస్తు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్ పాల్గొన్నారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని పురస్కరించుకుని మే 18న హైదరాబాద్‌లోని స్టేట్ మ్యూజియంలో మంత్రి జూపల్లి ఈ పర్యాటక వారోత్సవాలను మధ్యాహ్నం ఘనంగా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. తెలంగాణలో పర్యాటక రంగానికి ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేందుకు ఈ వారోత్సవాలు దోహదపడతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని చారిత్రక వారసత్వ సంపద, సంస్కృతి, ఎకో-టూరిజం ప్రదేశాలను ప్రమోట్ చేయడంతో పాటు, పర్యాటక రంగం ద్వారా లభించే ఉపాధి అవకాశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. క్ష్మీూషా సాంస్కృతిక శాఖ, పురావస్తు (హెరిటేజ్) శాఖ, నిథమ్ సంస్థల సమన్వయంతో పర్యాటక శాఖ ఈ ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా హెరిటేజ్ వాక్‌లు, పర్యాటక అవగాహన సదస్సులు, ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్లతో సమావేశాలు, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. రాష్ట్రంలో పర్యాటక రంగానికి తిరుగులేని ఆదరణ ఉందన్న మంత్రి.. ప్రపంచ ప్రసిద్ధ రామప్ప దేవాలయం, నాగార్జునసాగర్, బుద్ధవనం, ఆలంపూర్ జోగులాంబ ఆలయం, లక్నవరం చెరువు, బొగత జలపాతం, పైగా సమాధులు, రేమండ్స్ టూంబ్స్, గన్‌ఫౌండ్రీ, ఖజానా బిల్డింగ్, పానగల్ మ్యూజియంతో పాటు వరంగల్‌లోని చారిత్రక కట్టడాలు స్వదేశీ, విదేశీ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయని కొనియాడారు. మౌలిక వసతుల కల్పన, వారసత్వ సంపద పరిరక్షణ, సాంస్కృతిక పర్యాటక ప్రచారం, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో పర్యాటక రంగాన్ని సమీకృతంగా అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని స్పష్టం చేశారు. కార్యాచరణ ప్రణాళికలో భాగంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతితో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా జానపద కళా ప్రదర్శనలు, పేరిణి, శాస్త్రీయ నృత్యాలు, సాహిత్య కార్యక్రమాలు, సంగీత కచేరీలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. మే 23న హైదరాబాద్‌లో 'డెస్టినేషన్ తెలంగాణ: స్టాటజీస్ ఫర్ ది నెక్స్ట్ ఫ్రంటియర్ ఆఫ్ టూరిజం' అనే ఇతివృత్తంతో 'పర్యాటక సదస్సు - 2026' నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ సదస్సులో పర్యాటక రంగ భాగస్వాములు, హాస్పిటాలిటీ నిపుణులు, విధాన నిర్ణేతలు పాల్గొని తెలంగాణను దేశంలోనే అగ్రగామి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన భవిష్యత్తు వ్యూహాలపై చర్చించనున్నారని వివరించారు. 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' స్ఫూర్తితో నిర్వహించే ఈ వారోత్సవాలు తెలంగాణ పర్యాటక రంగానికి సరికొత్త కళను తీసుకువస్తాయని మంత్రి జూపల్లి ఆశాభావం వ్యక్తం చేశారు.

# 2034 వరకు నేనే ముఖ్యమంత్రిని

(మొదటి పేజీ తరువాయి)

ఉండొచ్చు. వంద శాతం ప్రజలను మెప్పించడం సాధ్యం కాదు. 60 నుంచి 75 శాతం మంది మన ఆలోచనలను ఆమోదిస్తే అదే పెద్ద విజయంగా భావిస్తా" అని సీఎం పేర్కొన్నారు. స్పష్టమైన లక్ష్యం, నిర్ణయాల్లో క్లారిటీ ఉంటే పాజిటివ్ ఎనర్జీ వస్తుందని, సమస్యలు ఎదురైనా లక్ష్యాన్ని గుర్తుచేసుకుని ముందుకు సాగాలని అన్నారు.

**తెలంగాణ రైజింగ్ 2047 విజన్**

ప్రపంచ స్థాయి మేధావులు, కార్పొరేట్ ప్రతినిధులు, ప్రజల అభిప్రాయాలను సేకరించి దాదాపు ఎనిమిది నెలలపాటు శ్రమించి "తెలంగాణ రైజింగ్ 2047" విజన్ డాక్యుమెంట్ రూపొందించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. 108 దేశాల ప్రతినిధుల సమక్షంలో గ్లోబల్ సమ్మిట్ వేదికగా ఈ విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించామని గుర్తుచేశారు. ఇప్పటివరకు దేశంలోని ఏ రాష్ట్రానికీ స్పష్టమైన దీర్ఘకాలిక లక్ష్యం లేదన్నారు.

ఎస్సీ ఉపకులాల వర్గీకరణ, బీసీ కులగణన, "జయ జయహే తెలంగాణ" గీతాన్ని రాష్ట్ర గీతంగా గుర్తింపు, అమరవీరుల కుటుంబాలకు గౌరవం వంటి అంశాలను ప్రభుత్వం పరిష్కరిస్తోందన్నారు. తుమ్మిడిహెట్టి, పాలమూరు--రంగారెడ్డి వంటి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్న సంకల్పంతో పనిచేస్తున్నామని తెలిపారు.

**మూసీ పునరుజ్జీవం చేస్తాం**

ఓఆర్ఆర్ లోపలి ప్రాంతంలో రాష్ట్ర జనాభాలో 40 శాతం మంది నివసిస్తున్నారని, అక్కడ అనేక సమస్యలు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. కాలుష్య పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలికి తరలించేందుకే హెచ్ఐఎల్టీ పాలసీ తీసుకొచ్చామని చెప్పారు. నగరంలోని నదులు, చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలను తొలగిస్తామని స్పష్టం చేశారు. "మూసీ పునరుజ్జీవం చేసి తీరుతాం. సంస్కరణలు తీసుకురావడం యుద్ధం లాంటిదే. భవిష్యత్ తరాల కోసం పనిచేస్తున్నా" అని పేర్కొన్నారు.

**భారత్ ఫ్యూచర్ సిటీపై దృష్టి**

ప్రతిష్టాత్మక భారత్ ఫ్యూచర్ సిటీ కోసం ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మెట్రో, నేషనల్ హైవేలు, పోర్ట్, ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ అభివృద్ధి చేస్తే భారీ పెట్టుబడులు వస్తాయని సీఎం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్‌అవుట్స్ ఎక్కువగా బాలికలలోనే ఉండేవని, గ్రామాల నుంచి పక్క ఊర్లకు వెళ్లే విద్యార్థినుల కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గించేందుకే మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. గత 28 నెలల్లో ఆర్టీసీకి ప్రభుత్వం రూ.10 వేల కోట్లు చెల్లించిందన్నారు. ఉచిత ప్రయాణంతో ఒక్కో మహిళ సంవత్సరానికి సుమారు రూ.10 వేల వరకు ఆదా చేసుకుంటోందని తెలిపారు. 2024-25లో ప్రభుత్వ పాఠశాలల్లో జీరో డ్రాప్‌అవుట్స్ నమోదైనట్లు నీతి ఆయోగ్ వెల్లడించిన విషయాన్ని సీఎం ప్రస్తావించారు.

"రాజకీయాల్లో 51 శాతం మార్కులు వస్తే మిగిలిన 49 శాతం విలువ సున్నా అవుతుంది. 51 శాతం ప్రజలను మెప్పించే విధంగా పరిపాలన సాగిస్తే అది 60 లేదా 70 శాతానికి చేరుతుంది. మనల్ని అంగీకరించని వారిని అణిచివేయాలని కాకుండా లక్ష్యంపై దృష్టి పెట్టాలి" అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# కాళేశ్వర క్షేత్రంలో సరస్వతీ అంత్య పుష్కరాలు

**డిప్యూటీ సీఎం భట్టికి మంత్రి కొండా సురేఖ ఆహ్వానం**

**బలగం టీవి, హైదరాబాద్**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం వేదికగా సరస్వతీ నది అంత్య పుష్కరాలను తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ పుష్కరాలలో పాల్గొనాల్సిందిగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ప్రజా భవన్ కు ప్రత్యేకంగా వచ్చి దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ డైరెక్టర్ ఎం. హనుమంతరావు, ఇతర ఉన్నతాధికారులు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను వేదోచ్చారణలతో ఆశీర్వదించారు. సరస్వతీ అంత్య పుష్కరాలను మే 21 నుంచి జూన్ 1 వరకు 12 రోజుల పాటు కాళేశ్వరంలో నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ సీఎంకు మంత్రి కొండా సురేఖ వివరించారు. మే 21న ఉదయం 5:43 గంటలకు తొలి పుష్కర స్నానంతో వేడుకలు ప్రారంభమవుతాయి. కంచి పీఠాధిపతి శ్రీ శంకర విజేంద్ర సరస్వతి స్వామి తొలి పుష్కర స్నానాన్ని ఆచరిస్తారని డిప్యూటీ సీఎంకు వివరించారు. త్రివేణి సంగమం వద్ద ప్రతిరోజూ గంగా హారతి నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోందని వివరించారు.



# పెట్రో, డీజిల్ ధరల పెరుగుదల

(మొదటి పేజీ తరువాయి)

లీటరుకు రూ.2 చొప్పున తగ్గించాయి. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన ధరలు పెరుగుతాయంటూ ఇటీవల పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే, సరిపడా నిల్వలు ఉన్నాయంటూ కేంద్రం వాటిని ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతూ వచ్చింది. ఈ క్రమంలో ధరలు పెంచడం

గమనార్హం. కాగా.. ఈ ప్రకటనలకు ముందే ఇంధన ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందనే వార్తలు దేశంలోని వాహనదారులను ఆందోళనకు గురిచేశాయి. దీంతో పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరారు. ఈ క్రమంలో కొన్ని బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. సీఎన్‌జీ వాహనదారులకు కూడా గ్యాస్ కంపెనీలు షాకిచ్చాయి. కిలో సీఎన్‌జీని రూ.2 చొప్పున పెంచాయి. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ3.29, డీజిల్‌పై రూ.3.14, తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ఆయిల్ కంపెనీలు పెంచాయి. పెట్రోల్ ధరలు: దిల్లీలో రూ.97.77, కోల్‌కతాలో 108.74, ముంబయిలో 106.68 , చెన్నైలో 103.67 (?2.83)గా ఉండనున్నాయి. ఇక డీజిల్ ధరలు: దిల్లీలో 90.67, కోల్‌కతాలో 95.13, ముంబయి 93.14, చెన్నైలో 95.25గా ఉండనున్నాయి. దాంతో దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో వీటి ధరలు మారాయి. పశ్చిమాసియాలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచంలో ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచాలని ఆయిలు కంపెనీలు నిర్ణయించాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన సంగతి తెలిసిందే.

ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14పై పెంచాయి. తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ధరలు పెంచాయి.



# తెలంగాణలో ఇప్పట్లో ఎన్నికలు లేవు

**సర్ ప్రక్రియను హడావిడిగా అమలు చేయడం తగదు**

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషన్‌కు పిసిసి వినతి**

**బలగం టీవి, హైదరాబాద్**

ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సర్ అంశంపై పీసీసీ బృదం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని

కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం మహేశ్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ వల్లే బెంగాల్‌లో రాజకీయ సమీకరణలు మారాయన్నారు. గెలవాల్సిన పార్టీలు ఓడిపోయాయి. తెలంగాణలో వచ్చే రెండేళ్లలో ఎలాంటి ఎన్నికలు లేవు. ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదు. ఆ పక్రియను ఏడాదిన్నరపాటు జాగ్రత్తగా చేయాలని ఇసిని కోరామని వెల్లడించారు.జనగణన పక్రియ ఇప్పటికే జరుగుతోంది. జనగణనతో పాటే ఎస్ఐఆర్ నిర్వహిస్తే సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుంది. ఎస్ఐఆర్‌లో ఓటు తొలగిస్తే దరఖాస్తు చేసుకునే గడువు 3 నెలలకు పెంచాలన్నారు. ప్రత్యక్షంగా 3-4 సార్లు బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఈసీని కలిసిన వారిలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

# ఉన్నావ్ దోషి కుల్దీప్ సింగ్‌కు ఎదురుదెబ్బ

**ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు రద్దు చేసిన సుప్రీం**

**మరోమారు పూర్తి విచారణ జరపాలని ఆదేశం**

**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఉన్నావ్ లైంగికదాడి కేసులో జీవితఖైదు పడిన భాజపా బహిష్కృత నేత కుల్దీప్ సింగ్ సెంగర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సెంగర్ జైలు శిక్షను నిలిపివేస్తూ గతంలో దిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను.. తాజాగా అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ పిటిషన్‌పై మరోసారి విచారణ జరపాలని హైకోర్టును సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. దిల్లీ హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా తనను దోషిగా తేల్చడం, యావజ్జీవ కారాగార శిక్ష విధించడంపై సెంగర్ వేసిన అప్పీల్‌ను రెండు నెలల్లోగా పరిష్కరించాలని హైకోర్టును ఆదేశించింది. ఒకవేళ దోషిగా తేల్చడంపై నిర్ణయం తీసుకోలేకపోతే.. యావజ్జీవ శిక్షను నిలిపివేయాలని కోరుతూ అతడు దాఖలు చేసిన పిటిషన్‌పైనైనా ఉత్తర్వులు ఇవ్వాలని తెలిపింది. ఈ కేసు అర్హతలపై తాము ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయడం లేదని, హైకోర్టు కొత్తగా విచారణ కొనసాగించవచ్చని పేర్కొంది. పోక్సో కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఒక ఎమ్మెల్యేను ప్రభుత్వ ఉద్యోగిగా పరిగణించవచ్చా, లేదా అనే అంశాన్ని కూడా పునఃపరిశీలించాలని సీజేఐ హైకోర్టుకు సూచించారు. 2017లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్ ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారానికి పాల్పడ్డారని కుల్దీప్ సింగ్ సెంగర్‌పై అభియోగాలు నమోదయ్యాయి. దీనిపై విచారణ జరిపిన ట్రయల్ కోర్టు.. సెంగర్‌ను దోషిగా తేలుస్తూ జీవితఖైదు విధించింది. ఆ తర్వాత సుప్రీం ఆదేశాలతో ఈ కేసు ఉత్తర్‌ప్రదేశ్‌లోని ట్రయల్ కోర్టు నుంచి దిల్లీ హైకోర్టుకు బదిలీ అయ్యింది. దీనిపై గతేడాది చివర్లో విచారణ జరిపిన దిల్లీ హైకోర్టు సెంగర్ శిక్షను నిలిపివేస్తూ తీర్పు వెలువరించింది. కోర్టు తీర్పును బాధితురాలి తరపు న్యాయవాదులు, సీబీఐ అధికారులు సుప్రీంలో సవాల్ చేశారు. దీనిపై గతంలో విచారణ జరిపిన న్యాయస్థానం.. సెంగర్ విడుదలపై స్టే విధించింది. తాజాగా హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేసింది.

# ఎన్నికలు కాగానే పెటరో ధరలు పెంచారు

**మోడీ వైఫల్యానికి ఇది నిదర్శనం**

**మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శ**

**బలగం టీవి, హైదరాబాద్**



ఎన్నికలు పూర్తి కాగానే పెట్రోల్ ధరలు పెంచి బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలను మోసం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశంలో నాలుగు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే వరకు అందరూ ఊహించిన విధంగా పెట్రోల్ డీజిల్ పెంచకుండా ఆపారన్నారు. ఎన్నికలు పూర్తికాగానే ముఖ్యమంత్రుల ప్రమాణ స్వీకారం కూడా కాకముందే దేశ ప్రజలకు ముఖ్యంగా తెలంగాణ ప్రజలకు పెట్రోల్ ధరలు పెంచి మరోసారి అన్యాయం చేసిందని వెల్లడించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ పెట్రోల్ ధరలు పెరగవని చాలాసార్లు అన్నారని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచిందని గుర్తు చేశారు.గతంలో యూపీఏ ప్రభుత్వం నయా పైసా పెంచక ముందే గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోడీ అపహాస్యం చేసే విధంగా వ్యవహరిస్తుండే అని చెప్పారు. మూడు రోజుల క్రితం హైదరాబాద్ పర్యటనలో పెట్రోల్, డీజిల్ తక్కువ వాడండి బంగారం కొనవద్దు, నూనె తక్కువ వాడాలి అన్నప్పుడే నడ్డివిరుస్తారని అనుమానం వచ్చిందన్నారు. ఆరు నెలల స్టాక్ ఉందని చెప్పారు. యుద్ధం కారణం చూపుతున్నారని.. యుద్ధం ఈరోజు రాలేదు.. ఇప్పటి నుండో ఉందన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలపై కాంగ్రెస్ పార్టీ అందరం కలిసి వ్యతిరేకిస్తున్నామని.. పెట్రోల్ ధరలపై బీజేపీ నేతలు స్పందించి ముక్కు నేలకు రాయాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు

**కేశరావు ఛైర్మన్‌గా కమిటీ ఏర్పాటు**

**బలగం టీవి, హైదరాబాద్**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి, వారి సేవలు,త్యాగాలను గౌరవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ శుక్రవారం జీఓ ఆర్టీ నం.679 జారీ చేసింది. ఉద్యమంలో కొందరు ప్రాణత్యాగం చేయగా, మరికొందరు శారీరక వైకల్యానికి గురయ్యారు. పలువురిపై కేసులు నమోదై జైలు జీవితం గడిపిన నేపథ్యంలో, వారి సేవలను అధికారికంగా గుర్తించాలనే చాలాకాలంగా ఉన్న డిమాండ్‌పై ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కమిటీకి ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె. కేశవరావు ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సభ్యులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్సీ విప్ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి నియమితులయ్యారు. సాధారణ పరిపాలన శాఖ పొలిటికల్ సెక్రటరీ ఈ కమిటీకి కన్వీనర్‌గా ఉంటారు.

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ముందుగా స్పష్టమైన ప్రమాణాలను రూపొందించడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత. ఆ ప్రమాణాల ఆధారంగా ఉద్యమకారుల జాబితాను సిద్ధం చేస్తుంది. అనంతరం వారికి ఎలాంటి గుర్తింపు, గౌరవం, సౌకర్యాలు కల్పించాలనే అంశాలపై ప్రభుత్వానికి సిఫారసులు చేస్తుంది.

కమిటీ అవసరమైతే అధికారులను పిలిపించుకోవచ్చు. సమాచారం సేకరించవచ్చు. సమావేశాలు నిర్వహించవచ్చు. అవసరమైన ఇతర వ్యక్తులు, అధికారులను కూడా సంప్రదించవచ్చు. కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి వీలైనంత త్వరగా సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, కార్యదర్శులు కమిటీకి అవసరమైన సహకారం అందించాలని ప్రభుత్వం ఆదేశించింది.



## "క్యాన్సర్ అట్లాస్ ఆఫ్ తెలంగాణ" ఎంతో ఉపయోగకరం

**సీఎం రేవంత్ రెడ్డి**

**డాక్టర్ నోరి దత్తాత్రేయుడు రూపొందించిన నివేదిక స్వీకరణ**

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణలో క్యాన్సర్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, వాటి కారణాలను విశ్లేషించడానికి "క్యాన్సర్ అట్లాస్ ఆఫ్ తెలంగాణ" ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధిపై ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు రూపొందించిన సమగ్ర నివేదికను జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి స్వీకరించారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. క్యాన్సర్ వ్యాధిపై సమగ్ర నివేదికను రూపొందించిన డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని ముఖ్యమంత్రి అభినందించారు. క్యాన్సర్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, వాటి కారణాలను విశ్లేషించడానికి ఈ నివేదిక ఎంతో ఉపయోగపడుతుందని సీఎం తెలిపారు. ఇందులోని డేటా ఆధారంగా క్యాన్సర్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక స్క్రీనింగ్ సెంటర్లు ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌కే పరిమితం కాకుండా, క్యాన్సర్ బాధితులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో కూడా ప్రత్యేక ఆస్పత్రులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. క్యాన్సర్ చికిత్సకు ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రుల్లో మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని ముఖ్యమంత్రి సూచించారు.

## ప్రశాంతి నిలయం దర్శించుకున్న లోకేశ్

**బలగం టీవి, హైదరాబాద్**

శ్రీ సత్యసాయి జిల్లాలో మంత్రి నారా లోకేశ్ రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. శుక్రవారం ఉదయం పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని మంత్రి సందర్శించారు. ప్రశాంతి నిలయంలో లోకేశ్‌కు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ నిర్వాహకులు స్వాగతం పలికారు. అనంతరం సాయి కుల్వంత్ మందిరంలోని శ్రీ భగవాన్ సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ స్టేట్ మీడియా కోఆర్డినేట్ రాష్ట్ర కార్యదర్శి బి.వి రాముడు తదితరులు పాల్గొన్నారు. పుట్టపర్తిలో అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్ క్రాఫ్ట్(ఏఎంసీఏ) తయారీ కేంద్రానికి శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొననున్నారు. ఏఎంసీఏ ఇంటిగ్రేషన్, ఫ్లైట్ టెస్టింగ్ సెంటర్, ఏరోనాటికల్ డెవలప్ మెంట్ ఏజెన్సీ, ఇతర రక్షణ రంగ ప్రాజెక్టులకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం చంద్రబాబు నాయుడుతో కలిసి శంకుస్థాపన చేయనున్నారు. రూ.15,803 కోట్లతో ఏఎంసీఏ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగనుంది. దీంతో 7,500 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నారు.



## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు


**- ఎస్పీ మహేష్ బి. గీతే**

**బలగం టీవీ,?రాజన్న సిరిసిల్ల:**

రాబోయే బక్రీద్ పండుగను జిల్లాలో అత్యంత ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ మహేష్ బి. గీతే పిలుపునిచ్చారు. పండుగ ఏర్పాట్లపై జిల్లా పోలీస్ కార్యాలయంలో ముస్లిం మత పెద్దలతో సమావేశం

నిర్వహించినారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గీతే మాట్లాడుతూ పండుగ నిర్వహణలో భాగంగా పశువుల కొనుగోలు, రవాణా మరియు వధ ప్రక్రియల్లో ప్రభుత్వ మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా పశువుల రవాణా చేసేవారు పశువైద్యాధికారులు జారీ చేసిన ఆరోగ్య ధృవీకరణ పత్రాలు, రవాణా అనుమతి పత్రాలు వెంట ఉంచుకోవాలని, పత్రాలు లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.జిల్లా సరిహద్దుల్లో అక్రమ పశువుల రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఈ తనిఖీల సమయంలో పోలీస్ మరియు వెటర్నరీ అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. చట్ట ప్రకారం ఆవులు, దూడలను వధించడం నిషేధమని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా లేదా ప్రజలకు అసౌకర్యం కలిగేలా మాంసం విక్రయాలు జరిపినా ఉపేక్షించబోమని తెలిపారు. అక్రమ రవాణా లేదా అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం ఉన్నవారు వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 8712537826 లేదా నోడల్ అధికారి స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ 8712656410 కు సమాచారం అందించి జిల్లా శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.? సోషల్ మీడియాలో వచ్చే వదంతులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి మాధ్యమాల్లో మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మార్ఫింగ్ చేసిన ఫోటోలు గానీ, అసత్య వార్తలు గానీ పోస్ట్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత పెద్దలు, బాధ్యతాయుత పౌరులు శాంతి సామరస్యాలను కాపాడడంలో పోలీసు యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు మరియు ముస్లిం మత పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంపీ రఘునందన్ రావును మర్యాదపూర్వకముగా కలిసిన ఆవుల లక్ష్మారెడ్డి



**బలగం టీవి, బోయినిపల్లి;**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం నీలోజిపల్లి గ్రామానికి చెందిన బిజెపి నాయకుడు ఆవుల లక్ష్మారెడ్డి శుక్రవారం రోజున మెదక్ ఎంపీ రఘునందన్ రావును మర్యాదపూర్వకముగా కలిశారు.

## ప్రజలకు చేరువగా ప్రత్యేక పీజీఆర్ఎస్

**ఒక నెల-ఒక గ్రామం-నాలుగు సందర్శనలు కార్యక్రమం**

**ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రణాళిక**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**బలగం టీవి, విజయవాడ**



ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు వారి సమస్యలను తెలుసుకొని, వేగవంతంగా పరిష్కరించే లక్ష్యంతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శుక్రవారం మైలవరం నియోజకవర్గం, జి.కొండూరు మండలం, కుంటముక్కల గ్రామంలో ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమంతో పాటు ఒక నెల–ఒక గ్రామం–నాలుగు సందర్శనలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును పరిశీలించి, నిర్దిష్ట గడువులో పరిష్కరించేందుకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. రెవెన్యూకు సంబంధించి మొత్తం 61 అర్జీలు వచ్చాయి. అదేవిధంగా పంచాయతీరాజ్‌కు 9, వైద్య ఆరోగ్యశాఖ, వ్యవసాయ శాఖలకు మూడు చొప్పున, మత్స్య శాఖకు రెండు అర్జీలు వచ్చాయి. డీఆర్‌డీఏ, పౌర సరఫరాలు, కార్మిక, పోలీసు, గ్రామీణ నీటి సరఫరా శాఖలకు ఒక్కో అర్జీ వచ్చాయి. మొత్తం 83 అర్జీలు రాగా.. ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిసారించి సమస్యలకు సత్వర, నాణ్యమైన పరిష్కారాలను చూపాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను స్థానికంగానే అధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం ఇలాంటి కార్యక్రమాల ద్వారా కలుగుతుందని, భూ సమస్యలు, పింఛన్లు, రేషన్, తాగునీరు, విద్యుత్, గృహాలు, ఉపాధి, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు సమన్వయ అధికారి జి.జ్యోతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బండి సంజయ్ కుమారుడిని అప్పగించాలి

**నైతికిత నిరూపణలకు ఇదే సమయం: రేవంత్**

**బలగం టీవి, హైదరాబాద్**

పోక్సో కేసు నిందితుడు బండి భగీరథ్ పారిపోవడం తప్పు అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ నైతిక బాధ్యత తీసుకుని కుమారుడిని అప్పగించాలని.. అలా చేస్తే ఆయన గౌరవం పెరుగుతుందని తెలిపారు. ఎలాంటి కేసులనైనా ధైర్యంగా ఎదుర్కోవాలని.. పారిపోతే సమస్యలకు పరిష్కారం దొరకదని చెప్పారు. బండి సంజయ్ కింది నుంచి కష్టపడి పైస్థాయికి వచ్చారని.. కుమారుడి కారణంగా ఆయనకు తలవంపులు వచ్చాయని సీఎం అన్నారు. తప్పయినా.. ఒప్పయినా ఆయన నిలబడి సమాధానం చెప్పాలన్నారు. తక్షణమే కుమారుడిని పీఎస్‌లో అప్పగించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ఈ కేసులో ఎవరిది తప్పనే విషయాన్ని విచారణ అధికారులు తేలుస్తారన్నారు.

## గిరిజన ఆర్థిక స్వావలంబనకు ఇప్ప పువ్వు ప్రాజెక్ట్

**గిరిజనుల ఆర్థికాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం**

**అడవిని ఆదాయ వనరుగా మార్చే దిశగా ముందడుగు**

**గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**బలగం టీవి, హైదరాబాద్**



గిరిజన ప్రాంతాల్లో సంప్రదాయ జీవన విధానానికి ఆధారమైన ఇప్ప పువ్వును గిరిజన కుటుంబాల ఆర్థికాభివృద్ధికి ప్రధాన వనరుగా మలిచే దిశగా తెలంగాణ ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రి కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన 'మహువా ఫ్లవర్ ప్రాజెక్ట్ అమలు'పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క,రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డితో కలిసి ఈ వర్క్ షాప్ లో పాల్గొన్నారు. సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... గిరిజన ఆదివాసీ మహిళలు, రైతులు, యువత, ముఖ్యంగా అత్యంత వెనుకబడిన గిరిజన వర్గాల జీవనోపాధి మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని స్పష్టం చేశారు. అడవుల్లో సహజసిద్ధంగా లభించే ఇప్ప పువ్వు గిరిజన సంస్కృతి, ఆహార సంప్రదాయాలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు.

ప్రస్తుతం ఇప్ప పువ్వును కేవలం సంప్రదాయ వినియోగానికి మాత్రమే పరిమితం కాకుండా, ఆహార ఉత్పత్తులు, ఔషధ వినియోగాలు, విలువ ఆధారిత పరిశ్రమలు, గ్రామీణ సూక్ష్మ పరిశ్రమల అభివృద్ధికి

ఉపయోగించే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. గిరిజన ప్రాంతాల్లో శాస్త్రీయ సేకరణ, నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వ్యవస్థలను అభివృద్ధి చేసి గిరిజన కుటుంబాలకు స్థిరమైన ఆదాయం అందించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రత్యేకంగా గిరిజన మహిళా సంఘాలు, స్వయం సహాయక బృందాలు, యువజన సమాఖ్యలను ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యం చేసి గ్రామీణ స్థాయిలో ఉపాధి అవకాశాలు పెంచాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. అటవీ సంపదపై గిరిజనుల హక్కులను పరిరక్షిస్తూ, అదే సమయంలో వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సమగ్ర విధానాలు అమలు చేస్తున్నామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన, పోషకాహార భద్రత, మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పన వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ఇప్ప పువ్వు ఆధారిత ప్రాజెక్టులను రూపొందిస్తున్నామని మంత్రి వెల్లడించారు.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి అడవి ఉత్పత్తుల విలువను పెంచడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం గిరిజన సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకొని పనిచేస్తోందని మంత్రి అన్నారు. గిరిజన ప్రాంతాల్లో సహజ వనరుల ఆధారంగా స్థిరమైన ఉపాధి అవకాశాలు సృష్టించి యువత వలసలను తగ్గించడం, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలతో అలాగే ప్రభుత్వ యంత్రాంగం ఉమ్మడిగా సమన్వయంతో పైలట్ ప్రాజెక్టులు చేపట్టి, భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే దిశగా కార్యాచరణ చేపట్టాలని మంత్రి సూచించారు.

గిరిజన సంపద గిరిజనులకే లాభదాయకంగా మారే విధంగా పారదర్శక విధానాలతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క గారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో సహజసిద్ధంగా లభించే ఇప్ప పువ్వు కేవలం అటవీ ఉత్పత్తి మాత్రమే కాకుండా గిరిజన కుటుంబాల ఆర్థిక స్వావలంబనకు బలమైన ఆధారంగా మారే సామర్థ్యం కలిగి ఉందన్నారు. ఇప్ప పువ్వు నుండి లడ్డూలు, నాచురల్ హెల్త్ ఫుడ్స్, సంప్రదాయ ఆహార పదార్థాలు తయారు చేయవచ్చని, ఇప్ప గింజల నుండి నూనె తయారీకి కూడా విశేష అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇప్ప ఆకులు, పువ్వులు, గింజలు అన్నీ వినియోగంలోకి తీసుకువస్తే గిరిజన ప్రాంతాల్లో చిన్న స్థాయి పరిశ్రమలు ఏర్పడి మహిళలకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుందని ఆమె పేర్కొన్నారు. ఇప్ప పువ్వుతో పోషకాహార పదార్థాలు, పిల్లలకు ఆరోగ్యకరమైన స్నాక్స్, మిక్స్డ్–లలెట్ ఆధారిత ఫుడ్ ప్రొడక్ట్స్, హెర్బల్ టీలు, నాచురల్ స్వీటెనర్లు తయారు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. గ్రామీణ స్థాయిలో మహిళా సంఘాలకు శిక్షణ ఇచ్చి 'ట్రైబల్ నాచురల్ ఫుడ్ బ్రాండ్స్' రూపంలో మార్కెట్‌లోకి తీసుకురావాలని సూచించారు. గిరిజన మహిళల సంప్రదాయ జ్ఞానాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేస్తే ప్రపంచ మార్కెట్‌లో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావచ్చని సీతక్క పేర్కొన్నారు. ప్రతి గిరిజన గ్రామంలో ఇప్ప పువ్వు సేకరణ, నిల్వ, ప్రాసెసింగ్‌కు మినీ యూనిట్లు ఏర్పాటు చేయాలని, యువతను స్టార్టప్ రంగంలో ప్రోత్సహించాలని సూచించారు. ఇప్ప పువ్వు ఆధారిత ఉత్పత్తులకు ప్రత్యేక బ్రాండింగ్, ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, ఈ–కామర్స్ మార్కెటింగ్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకోవాలని తెలిపారు. గిరిజన మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీలు, ప్రభుత్వ సబ్సిడీలు, స్వయం ఉపాధి పథకాలను అనుసంధానం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకట రామయ్య చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ విశేషంగా ఆకట్టుకుంది. ఇప్ప పువ్వును కేవలం అటవీ ఉత్పత్తిగా కాకుండా గిరిజన ఆర్థిక స్వావలంబనకు ఆధారంగా మలిస్తే గ్రామీణాభివృద్ధికి కొత్త దిశ ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు.

సమావేశంలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి , మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, గిరిజన ఎమ్మెల్యేలు రామచంద్ర నాయక్,మురళి నాయక్ లతో క్ష్మీటు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి బి.ఎల్. సంతోష్, భద్రాచలం పి.ఓ రాహుల్, ఉట్నూర్ పి.ఓ మంద మకరందు, ఏటూరునాగారం పి.ఓ లెనిన్ వత్సాల్ టొప్పో .పలువురు ప్రముఖ ప్రొఫెసర్లు, నిపుణులు చంద్ర రామారావు పాల్గొన్నారు .

## పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి చేయాల్సిందే



**నర్లపూర్ నుంచి ఉదండాపూర్ వరకు పాదయాత్ర**

**మాజీమంత్రి శ్రీనివాసరెడ్డి వెల్లడి**

**ఆందోళనలకు సిద్ధం అవుతున్న బిఆర్ఎస్ నేతలు**

**బలగం టీవి, హైదరాబాద్**

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నాయకులు పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి రైతాంగాన్ని, జిల్లా ప్రజలను ఆదుకోవాలనే సంకల్పంతో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నివాసంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. మహబూబ్ నగర్ జిల్లా అత్యధికంగా వలస పోయిన జిల్లా. సాగునీరు ఇస్తే వలసలు తగ్గుతాయని భావించి బీఆర్ఎస్ హయాంలో పాలమూరు ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేసి 90 శాతం పనులు పూర్తి చేశాం. పది శాతం పనులు పూర్తి చేస్తే రైతులకు సాగునీరు అందుతుంది. కానీ ఇప్పటికి మోటార్లు ఆన్ చేయడం లేదు. పాలమూరు ప్రాజెక్ట్ పూర్తి చేయాలని నర్లపూర్ నుంచి ఉదండాపూర్ వరకు పాదయాత్ర చేసి ప్రభుత్వం మెడలు వంచుతామని వెల్లడించారు. కేసీఆర్‌ను కలిసి పాదయాత్ర పై చర్చించి కార్యాచరణ ప్రకటిస్తామని, జూన్ నెలలోనే పాదయాత్ర ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు నరేందర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, అంజయ్య యాదవ్, మర్రి జనార్ధన్ రెడ్డి, బీరం హర్షవర్ధన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్ రెడ్డి, వాణి దేవి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు ఆంజనేయులు గౌడ్, వాల్య నాయక్, వెంకటేశ్వర్ రెడ్డి, ఇంతియాజ్, బీఆర్ఎస్ గద్వాల ఇన్‌ఛార్జ్ హనుమంతు నాయుడు తదితరులు పాల్గొన్నారు.పాలమూరు వ్యక్తి ముఖ్యమంత్రి అయి జిల్లాకు ఏమైనా చేస్తారని ఎక్కువ మంది ఓట్లు వేశారు. కానీ ఇప్పుడు పాశ్చతాపం పడుతున్నారని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. పాలమూరు ప్రాజెక్ట్ ద్వారా ఉమ్మడి జిల్లాలో 10 లక్షల ఎకరాలకు సాగునిరు ఇచ్చే అవకాశం ఉందని వివరించారు. ప్రాజెక్ట్ ను సందర్శించి పనులు పూర్తి చేసేందుకు పాలకులు దృష్టి పెట్టాలని సూచించారు. కాళేశ్వరం మీద తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా మంత్రులకు ప్రాజెక్టులపై అవగాహన లేదని దుయ్యబట్టారు. పాలమూరు ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి సమీక్షా చేయాలని, ప్రతిపక్ష పార్టీ నాయకుల అభిప్రాయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. వడ్లు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడం లేదని విమర్శించారు. క్ష్మి–రభుత్వం వ్యవసాయ రంగాన్ని విస్మరించిందని, ప్రాజెక్టులను పూర్తి చేయలేదు. పండించిన పంట కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆరోపించారు. పాలమూరు ప్రాజెక్ట్ మీద కనీసం రివ్యూ చేయకపోవడం దురదృష్టకరమని అన్నారు. కాంగ్రెస్ నాయకులు కేసులు వేసి ప్రాజెక్ట్ ఆపాలని చూసినా 90 శాతం పనులు పూర్తి చేసి ఒక పంపును కేసీఆర్ ప్రారంభించారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ తిరిగి అధికారం లోకి వచ్చి ఉంటే 5 నెలల్లోనే పాలమూరును పూర్తి చేసే వాళ్లమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసి ఉంటే రిజర్వాయర్లు నింపుకునేందుకు అవకాశం ఉండేదని, పాలమూరు ప్రాజెక్ట్ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువస్తామని అన్నారు.

## పొదుపు చర్యల్లో టిడిపి మరో అడుగు

**మహానాడును వర్చువల్‌గా నిర్వహించాలని నిర్ణయం**

**నెల్లూరు వేదికగా నిర్వహించాలనుకున్న మహానాడు రద్దు**

**మంగళగిరి పార్టీ కార్యాలయంలో మహానాడు ఏర్పాట్లు**

**వర్చువల్గా జిల్లా పార్టీ కార్యాలయాలద్వారా ప్రసారం**

**బలగం టీవి, అమరావతి**

పొదుపు చర్యల్లో భాగంగా తెదేపా అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. మహానాడును ఈసారి ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. అమరావతిలోని తెదేపా కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో వేదిక ఏర్పాటు చేసి నిర్వహించాలని పార్టీ నేతలకు సీఎం సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,845 క్లస్టర్లలో పార్టీ శ్రేణుల కోసం ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నారు. ఎన్టీఆర్ భవన్ నుంచి పొలిట్ బ్యూరో సభ్యులు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారి నెల్లూరు జిల్లాలో మహానాడు నిర్వహించాలని తొలుత నిర్ణయించి ఏర్పాట్లు ప్రారంభించారు. పొదుపు చర్యల్లో భాగంగా ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 27, 28న మహానాడు జరగనున్న సంగతి తెలిసిందే. తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడుపై పార్టీ హై కమాండ్ కీలక నిర్ణయం తీసుకుంది. ముందుగా నెల్లూరులో మూడు రోజుల పాటు నిర్వహించాలని భావించిన మహానాడును ఇప్పుడు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో హైబ్రిడ్ విధానంలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు మే 27, 28 తేదీల్లో రెండు రోజుల పాటు మహానాడు కార్యక్రమం నిర్వహించేందుకు నిర్ణయించారు. భారీ జన సమీకరణకు బదులుగా సాంకేతికతను వినియోగిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులను అనుసంధానించే విధంగా ఈసారి మహానాడును నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. టీడీపీ చరిత్రలో హైబ్రిడ్ విధానంలో మహానాడు నిర్వహణకు తీసుకున్న ఈ నిర్ణయం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. పార్టీ కార్యకర్తల భాగస్వామ్యాన్ని పెంచుతూ, సమర్థవంతమైన నిర్వహణకు ఈ విధానం ఉపయోగపడుతుందని టీడీపీ నేతలు భావిస్తున్నారు.

పార్టీ కేంద్ర కార్యాలయంలో పరిమిత సంఖ్యలో నేతలు ప్రత్యక్షంగా పాల్గొనగా, జిల్లాలు, నియోజకవర్గాలు, క్లస్టర్ల స్థాయిలో నాయకులు, కార్యకర్తలు వర్చువల్ విధానంలో హాజరుకానున్నారు. మంగళగిరిలో జరిగే మహానాడుకు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, కేంద్ర కమిటీ, రాష్ట్ర కమిటీ సభ్యులు, అధికార ప్రతినిధులు ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రత్యక్షంగా హాజరవుతారు. అలాగే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఎంపీలు, ముఖ్య నాయకులు తమ తమ నియోజకవర్గాల నుంచి ఆన్‌లైన్ ద్వారా కార్యక్రమంలో పాల్గొంటారు. పార్టీకి చెందిన 1848 క్లస్టర్ల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు కూడా ఆయా క్లస్టర్ల నుంచే వర్చువల్‌గా మహానాడులో పాల్గొనేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఒకేసారి మహానాడును వీక్షించేలా సాంకేతిక సదుపాయాలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా మహానాడులో ప్రవేశపెట్టే రాజకీయ, ఆర్థిక, సంక్షేమ తీర్మానాలు సహా అన్ని కార్యక్రమాలు సంప్రదాయ మహానాడు తరహాలోనే నిర్వహించనున్నట్లు టీడీపీ నేతలు వెల్లడించారు. తీర్మానాల ఆమోదం, నాయకుల ప్రసంగాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చలు అన్నీ హైబ్రిడ్ మోడల్‌లో కొనసాగనున్నాయి. పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ విధానాలపై చర్చ, భవిష్యత్తు రాజకీయ వ్యూహాల రూపకల్పన వంటి అంశాలు ఈ మహానాడులో ప్రధాన అజెండాగా ఉండనున్నాయి.




## ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ లైంగికదాడి కేసు

**నిర్లక్ష్యం వహించిన ముగ్గురు పోలీస్ అధికారుల సస్పెన్షన్**

**బలగం టీవి, కోల్‌కతా**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిన ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో విద్యార్థిని అత్యాచారం, హత్య కేసులో విధినిర్వహణల్లో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు అధికారులపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి వేటు వేశారు. ఆ ముగ్గురినీ సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. వీరిలో అప్పటి కోల్‌కతా పోలీస్ కమిషనర్ వినీత్ గోయెల్, అభిషేక్ గుప్తా, మనోజ్ ముఖోపాధ్యాయ్ ఉన్నారు. కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పటల్‌లోని 31 ఏళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ డాక్టర్ 2024 ఆగస్టులో అత్యాచారం, హత్యకు గురైంది. ఈ ఘటన సంచలనమైంది. వైద్యులు, విద్యార్థులు, పౌర సమాజం నిరసనలకు దిగారు. ఈ ఘటనలో నిందితులను శిక్షించి న్యాయం చేయాలని, పనిప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ఆసుపత్రి అధికారులు, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఈ ఘటనకు బాధ్యత వహించాలని డిమాండ్లు వెల్లువెత్తాయి. సాక్ష్యాలను తారుమారు చేయడం, పోలీసు చర్యలో జరుగుతున్న జ్యాపం, సంస్థాగతమైన నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాలతో ఈ కేసును సీబీఐ చేపట్టింది. పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో ఈ ఘటనను బీజేపీ ప్రధానంగా ప్రస్తావించింది. ఆర్జీ కర్ బాధితురాలికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చింది. బాధితురాలి తల్లికి రత్న దేబ్‌నాథ్‌కు పానిహతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టిక్కెట్ కూడా ఇచ్చింది. ఆ నియోజకవర్గం నుంచి టీఎంసీ అభ్యర్థి తీర్థంకర్ ఘోష్‌పై రత్న దేబ్‌నాథ్ 28,836 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలుపొందారు. ఈ క్రమంలో ఆ ముగ్గురు అధజకారులపై సిఎం తక్షణ చర్యలకు ఉపక్రమించారు.

# చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం..

**-రైతులు ఆందోళన చెందవద్దు**

**-ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని, రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని,జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగవంతంగా కొనసాగుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు . సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సిరిసిల్ల అపెరల్ పార్క్ లోని షెడ్ లలో వరి ధాన్యం దిగుమతి ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఇప్పటిదాకా ఎన్ని లారీలు వచ్చాయి? ఎన్ని అన్లోడింగ్ చేశారు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోల ప్రక్రియ వేగంగా కొనసాగుతుందని తెలిపారు. ఈసారి ధాన్యం తరలింపులో లారీలు, వ్యాన్లు, ట్రాక్టర్లు కూడా ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. దాన్యం దిగుమతి కోసం సిరిసిల్ల అపెరల్ పార్క్ లోని షెడ్ లలో వాడుకునేందుకు ప్రభుత్వ అనుమతి ఇచ్చిందని అన్నారు . ఇక్కడ హమాలీలు వెంటవెంటనే ధాన్యం దిగుమతి చేస్తున్నారని అన్నారు . రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భోజన, వసతి, వైద్య సదుపాయం కల్పిస్తున్నారని,. రైతులెవరు ఆందోళన చెందవద్దని ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకు వస్తే ఎప్పటికప్పుడు పరిష్కరిస్తారని స్పష్టం చేశారు. గతంలో కంటే ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా కొనసాగుతుందని రైతులు ఈ విషయాన్ని



గమనించాలని కోరారు. ప్రజా ప్రభుత్వం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు తుమ్మల నాగేశ్వరరావు అందరి సహకారంతో దాన్యం కొనుగోలు ప్రక్రియ సాగుతుందని పేర్కొన్నారు.



# ప్రతిమ కాలేజీ బస్సు - కారు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

**బలగం టీవీ గంభీరావుపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం సముద్ర లింగాపూర్ సమీపంలో శుక్రవారం ఉదయం రోడ్డు ప్రమాదం సంభవించింది. ప్రతిమ విజ్ఞాన విద్యా సంస్థకు చెందిన బస్సు, ఎదురుగా వస్తున్న కారు ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాద ధాటికి కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు.

ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన స్థానికులు, వాహనంలో చిక్కుకుపోయిన క్షతగాత్రులను బయటకు తీశారు. అనంతరం వారిని చికిత్స నిమిత్తం హుటాహుటిన సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

**అమలుకు నోచని రోడ్డు భద్రత**

మరోవైపు, జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఏటా రోడ్డు భద్రతా వారోత్సవాల పేరిట కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం మారడం లేదు. అవగాహన సదస్సులు కేవలం ప్రచారానికే పరిమితమవుతున్నాయని, నిబంధనల అమలులో అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్లే ఇలాంటి అనర్థాలు జరుగుతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా యువత అతివేగం, హెల్మెట్ మరియు సీటు బెల్ట్ ధరించకపోవడం వంటి నిర్లక్ష్యపు చర్యలు ప్రాణాల మీదకు తెస్తున్నాయి. 'వేగం కంటే ప్రాణం మిన్న' అనే విషయాన్ని విస్మరించి చేసే చిన్న పొరపాటు ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాహన తనిఖీలను కఠినతరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.



# హమాలీల సంఖ్య పెంచి, ధాన్యం అన్ లోడింగ్ చేయాలి..

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

కొనుగోలు కేంద్రాల్లో సేకరించి, లారీల ద్వారా సిరిసిల్ల అపెరల్ పార్క్ లోని షెడ్ లలో నిల్వ చేయడానికి తరలించిన ధాన్యం బస్తాలను అన్ లోడింగ్ చేయడానికి హమాలీల సంఖ్య పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. శుక్రవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి సిరిసిల్ల అపెరల్ పార్క్ లోని షెడ్ లను సందర్శించి, ధాన్యం అన్ లోడింగ్ చేస్తున్న తీరును కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుండి సేకరించిన ధాన్యం నిల్వ చేసేందుకు అందుబాటులో ఉన్న షెడ్ ల వివరాలను సంబంధిత అధికారులను అడిగి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలుసుకున్నారు. వేసవి కాలం దృష్ట్యా హమాలీల కోసం త్రాగునీరు, భోజనం, తదితర సదుపాయాలు సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు ఎన్ని లారీలు వచ్చాయి, ఎన్ని లారీల ధాన్యం అన్ లోడ్ చేశారు అనే వివరాలను ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు అన్ లోడింగ్ చేయాలని సూచించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు.సందర్శనలో జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, తహసీల్దార్ మహేష్, తదితరులు ఉన్నారు.



# విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదవాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

పోటీ పరీక్షల కోసం అభ్యర్థులు ప్రణాళిక ప్రకారం చదవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా శాఖ వారోత్సవాల్లో కింద ఎస్సీ సంక్షేమ శాఖ ఆద్వర్యంలో ఎస్సీ స్టడీ సర్కిల్ లో ఐదు నెలల ఉచిత శిక్షణ తరగతులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం ప్రారంభించారు. ముందుగా స్టడీ సర్కిల్ ఆవరణలో కలెక్టర్ మొక్క నాటారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ..ఎస్సీ స్టడీ సర్కిల్ లో ఐదు నెలల ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి అభ్యర్థి ఒక్కో సబ్జెక్ట్ కు పక్కా ప్రణాళిక ప్రకారం షెడ్యూల్ సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజూ దినపత్రికలు చదవాలని సూచించారు. దీంతో రాష్ట్ర, దేశ, ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న అన్ని విషయాలు తెలుస్తాయని తెలిపారు. ఎక్కువ గంటలు చదవాలని, రివిజన్ చేయాలని సూచించారు. రెసిడెన్షియల్ విధానంలో ఉన్న కోచింగ్ ను వినియోగించుకొని అందరూ ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ ఖాళీగా ఉన్న సీట్లను ప్రభుత్వ నిబంధనల మేరకు భర్తీ చేస్తామని, అభ్యర్థులు సిరిసిల్లలోని అంబేద్కర్ స్టడీ సర్కిల్ లో సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు పిలుపు నిచ్చారు.కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, ఏఎస్ డబ్ల్యూఓ విజయలక్ష్మి, స్టడీ సర్కిల్ హనరరీ డైరెక్టర్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.




# గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం

**బలగం టీవీ, బోయినిపల్లి;**

వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక విధానాలు మేలైన యాజమాన్య పద్ధతులను పాటిస్తూ సాగు ఖర్చులను తగ్గించి, అధిక ఫల సాయంతో మంచి ఆదాయాన్ని పొందవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు రైతులకు సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం దేశాయిపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో సిరిసిల్ల వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు ప్రొఫెసర్ డాక్టర్. జె.సురేష్, డాక్టర్. ఎం. శ్రీజ, మండల వ్యవసాయ అధికారి కె.ప్రణీత లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ: పంటల సాగులో యూరియా వినియోగాన్ని తగ్గించాలని సూచించడం జరిగింది. విచక్షణారహితంగా ఎరువులను, రసాయన ఎరువులను పురుగుమందులను వాడవద్దని తద్వారా నేల,నీరు కలుషితమవుతుందని సూచించారు. సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టడం ద్వారా ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను పొందవచ్చని సూచించారు. వరి పంటతో పాటు ఇతర పంటలైన చిరుధాన్యాలు జొన్న, సజ్జ,పప్పు ధాన్యాలు అయిన మినుము పెసర నూనే గింజల పంటలైన పొద్దుతిరుగుడు, వేరుశనగ,నువ్వులు వంటి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో దేశాయిపల్లి గ్రామ సర్పంచ్ నిమ్మ భాగ్యలక్ష్మి- శ్రీనివాస్ రెడ్డి,వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి రజిత, వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు బి.అనిల్, పి.శ్రీధర్, అభ్యుదయ రైతులు, గ్రామ రైతులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

# బాలల హక్కుల రక్షణ మనందరి బాధ్యత..



**-బాల్య వివాహాలు లేని సమాజమే లక్ష్యం**

**-రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

పిల్లల హక్కుల పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి అన్నారు . శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కే ఫంక్షన్ హాల్లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లకు నిర్వహించిన అవగాహన సదస్సుకు సీతా దయాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితేలతో కలిసి ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 'పిల్లల రక్షణ-సమాజం బాధ్యత' అనే గోడపత్రికలను ఆవిష్కరించడంతో పాటు కిశోర బాలికలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సీతా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామం మరియు వార్డు స్థాయిలో బాలల హక్కుల పరిరక్షణ కమిటీలు తప్పనిసరిగా ఏర్పాటు కావాలని ఆదేశించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, ఏ ఒక్క బాల కార్మికుడు జిల్లాలో ఉండకూడదని అన్నారు . పాఠశాలల్లో డ్రాప్ అవుట్లు లేకుండా చూడాలని, ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాల్లోని సౌకర్యాలను వివరించి పిల్లలను చేర్పించాలని సూచించారు. 1098 హెల్ప్ లైన్ వినియోగంపై అవగాహన పెంచాలని, అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం సక్రమంగా అందేలా చూడాలని కోరారు. చదువుతోనే సామాజిక, ఆర్థిక మార్పు సాధ్యమని ఆమె పేర్కొన్నారు.

**విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు బాలబాలికల సంరక్షణకు కమిటీలు నిరంతరం కృషి చేయాలన్నారు. జిల్లాలో 100కు పైగా అంగన్వాడీ భవనాలను నిర్మిస్తున్నామని, విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు . విద్యార్థుల డైట్ చార్జీలను 40 శాతం పెంచామని, నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. మరోవైపు జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగంగా సాగుతున్నాయని, ఇప్పటివరకు 40 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని, చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని అన్నారు.

**మిషన్ వాత్సల్యతో అనాథలకు ఆసరా: కలెక్టర్ గరిమ అగ్రవాల్**

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు . అనాథ పిల్లలకు 'మిషన్ వాత్సల్య' పథకం కింద నెలకు 4,000 రూపాయల ఆర్థిక సాయం అందిస్తున్నామని, జిల్లాలో ప్రస్తుతం 117 మందికి ఈ ప్రయోజనం అందుతోందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు కనీసం వారానికి ఒకసారి అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలతో కలిసి భోజనం చేస్తూ అక్కడి నాణ్యతను పరిశీలించాలని ఆదేశించారు. ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ 'ఆపరేషన్ ముస్కాన్' ద్వారా బాల కార్మికులకు విముక్తి కల్పిస్తున్నామని, షీ టీమ్స్ ద్వారా మహిళలు, బాలికలకు రక్షణ కల్పిస్తున్నామని అన్నారు . ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు వచన్ కుమార్ రెడ్డి, బండి అపర్ణ, మర్రిపల్లి చందన, గోగుల సరిత, వందన గౌడ్, ప్రేమలత అగ్రవాల్, మార్కెట్ కమిటీ చైర్మన్లు స్వరూపారెడ్డి, రాములు నాయక్, రాజు, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, సిరిసిల్ల ఆర్డీఓ రాజేందర్ రెడ్డి, డీఎస్పీ నాగేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలను సద్వినియోగించుకుని లక్ష్యాలను సాధించాలి

**-కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

విద్యార్థులు, నిరుద్యోగ యువత గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఈ నెల 11 నుండి 17 వరకు నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలను పురస్కరించుకుని, శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ గరిమ అగ్రవాల్ , జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. తొలుత తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' ఆలపించగా, అనంతరం గ్రంథాలయంలో చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పలువురు విజేతలను కలెక్టర్ ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను, విద్యార్థుల మానసిక ఉల్లాసం కోసం అందుబాటులో ఉంచిన క్రీడా పరికరాలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లోనూ రాణించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్చి 6న ప్రారంభించిన ప్రగతి ప్రణాళిక ద్వారా జిల్లాలోని పది శాఖల సమన్వయంతో పారిశుధ్యం, వైద్యం, విద్య వంటి రంగాల్లో వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నమని అన్నారు . ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహార పంపిణీని ముమ్మరం చేశామని, ఆరేళ్లలోపు పిల్లలందరూ కేంద్రాల్లో నమోదు కావాలని కోరారు.

తాను కూడా గ్రంథాలయంలోనే చదివి ఈ స్థాయికి చేరుకున్నానని గుర్తు చేస్తూ, లైబ్రరీ అనేది పోటీతత్వాన్ని పెంచే గొప్ప వేదిక అని అన్నారు . సమయం ఎంతో విలువైందని, అభ్యర్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ ఒక ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. ప్రతిరోజూ వార్తాపత్రికలు చదవడం ద్వారా సామాజిక అంశాలపై పట్టు సాధించవచ్చని, ప్రతి సబ్జెక్టుకు నిర్దిష్ట గడువు పెట్టుకుని చదివితే విజయం తథ్యమని ఆకాంక్షించారు. వచ్చే వారం యువజన, పర్యాటక శాఖ




ఆధ్వర్యంలో నిర్వహించనున్న వాకథాన్, జాబ్ మేళాలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అనంతరం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 'టాస్క్' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణ తరగతులను కలెక్టర్ సందర్శించి, విద్యార్థుల అభ్యసన తీరును అడిగి తెలుసుకున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధికి విశేష కృషి చేస్తోందని, ఇప్పటికే ఇక్కడ చదువుకున్న 150 మంది ఉద్యోగాలు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత పాఠకుల కోసం విలేజ్ రీడింగ్ రూమ్లను కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నమని అన్నారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం తరలింపు, అన్లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి..



**- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

కొనుగోలు కేంద్రాల నుండి సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే ప్రక్రియతో పాటు, మిల్లుల వద్ద వాహనాల అన్లోడింగ్ను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులను, మిల్లు యజమానులను ఆదేశించారు. శుక్రవారం ఇల్లంతకుంట, బోయినిపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించి, ధాన్యం కొనుగోలు కేంద్రాలను మరియు రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.?ఈ పర్యటనలో భాగంగా ఇల్లంతకుంట మండలం తాళ్లపల్లిలోని రాజరాజేశ్వర రైస్ మిల్లును, రహీంఖాన్ పేటలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదామును సందర్శించారు. అనంతరం పొత్తూరు, మాన్వాడ, కొదురుపాక, మరియు వెంకటాపూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలను ఏమాత్రం జాప్యం చేయకుండా వాహనాల ద్వారా మిల్లులకు చేరవేయాలని, ఇందుకోసం రవాణా కాంట్రాక్టర్లు తగినన్ని వాహనాలను సమకూర్చాలని స్పష్టం చేశారు.?ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాల దృష్ట్యా రైతులు నష్టపోకుండా ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రతి కేంద్రంలో సరిపడా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని, ధాన్యం కొనుగోలు పూర్తయిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. మిల్లుల వద్ద అన్లోడింగ్లో జాప్యం జరగకుండా ఉండేందుకు హమాలీల సంఖ్యను పెంచుకోవాలని, నిరుపయోగంగా ఉన్న గోదాములను ధాన్యం నిల్వకు సిద్ధం చేయాలని అధికారులకు తెలిపారు. మిల్లుల పర్యవేక్షణకు కేటాయించిన సిబ్బంది అప్రమత్తంగా ఉండి అన్లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసేలా చూడాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమాల్లో తహసీల్దార్లు సురేష్, షరీఫుద్దీన్, సుజాత తదితరులు పాల్గొన్నారు



## పర్సెంటేజీ విధానంపై 15మందితో కమిటీ

### ఫిల్మ్ ఛాంబర్ కీలక నిర్ణయం

**బలగం టీవీ, హైదరాబాద్**



సింగిల్ స్క్రీన్ థియేటర్ యాజమాన్యాలు, నిర్మాతలకీ మధ్య సినిమాల ప్రదర్శనల విషయంలో వివాదం నెలకొన్న క్రమంలో ఓ అంగీకారానికి వచ్చారు. దీనిపై వాణిజ్య మండలి అధ్యక్షుడు డి.సురేశ్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం థియేటర్ యాజమాన్యాలు, నిర్మాతలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఫిల్మ్ ఛాంబర్ కీలక నిర్ణయం తీసుకుంది. పర్సంటేజీ విధానంపై కమిటీ ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. 15 మందితో కమిటీ వేయనున్నట్లు వెల్లడించింది. ఈ కమిటీ రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. దీనిపై సి.కల్యాణ్ మాట్లాడుతూ.. రెండు నెలల్లో సమస్య పరిష్కారం అవుతుందన్నారు. సినిమాల విడుదలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టంచేశారు. కమిటీలో ఐదుగురు నిర్మాతలు, ఐదుగురు ఎగ్జిబిటర్లు, ఐదుగురు డిస్ట్రిబ్యూటర్లు ఉంటారని ఆయన తెలిపారు. శుక్రవారం జరిగిన సమావేశంలో నిర్మాతలు అల్లు అరవింద్, చదలవాడ శ్రీనివాసరావు, సుప్రియ యార్లగడ్డ, రవి కిషోర్, మైత్రీ రవి, సి.కల్యాణ్, దిల్ రాజు, రాధా మోహన్, చెరుకూరి సుధాకర్, భోగవల్లి బాపినీడు, సాహు గారపాటి, సతీష్ కిలారు, నాగవంశీ, ఎస్ కె ఎన్, రాజేష్ దండా, ధీరజ్ మొగిలినేని దాదాపు 50 మంది నిర్మాతలు పాల్గొన్నారు. ఎగ్జిబిటర్స్ తరపున విజయేందర్ రెడ్డి, శ్రీధర్ తదితరులు హాజరయ్యారు.



## మెగాఫోన్ పట్టిన రామ్ పోతినేని

**బలగం టీవీ, హైదరాబాద్**




టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన అభిమానులకు అదిరిపోయే బర్త్ డే సర్ప్రైజ్ ఇచ్చారు. ఇన్నాళ్లూ తన నటనతో, డ్యాన్స్‌తో వెండితెరపై మ్యాజిక్ చేసిన రామ్, ఇప్పుడు సరికొత్త అవతారంలోకి మారబోతున్నారు. తన 23వ చిత్రం ద్వారా రామ్ దర్శకుడిగా పరిచయం కాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించాడు. ఈ వార్త ఇప్పుడు ఫిల్మ్ నగర్ వర్గాల్లో సంచలనంగా మారింది. ఎవరూ ఊహించని విధంగా ఒక ఉత్కంఠభరితమైన సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌తో రామ్ తన దర్శకత్వ ప్రయాణాన్ని ప్రారంభించ బోతున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రానికి 'వీర' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఖరారు చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ అత్యంత ఆసక్తికరంగా ఉంది. 'ది స్టోరీ ఆఫ్ ఏ లోన్ వోల్ఫ్' అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ పోస్టర్ చూస్తుంటే, రామ్ ఒక ఇంటెన్స్ రోల్‌లో కనిపించబోతున్నారని స్పష్టమవుతోంది. ఈ సినిమా కోసం రామ్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన సొంత నిర్మాణ సంస్థ అయిన 'స్రవంతి మూవీస్' ఉండగానే, ప్రత్యేకంగా 'రాపో సినిమాటిక్స్' అనే కొత్త ప్రొడక్షన్ హౌస్‌ను ప్రారంభించారు. తన కలల ప్రాజెక్ట్‌ను రామ్ సోదరుడు కృష్ణ పోతినేని ఈ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకం గా నిర్మించనున్నారు. దర్శకుడిగా తన నిర్ణయం గురించి రామ్ స్పందిస్తూ.. 'ఇన్నాళ్లు వాళ్ల కథల్లో నా ముఖం చూశారు.. ఈ కథలో నా గొంతు వింటారు' అంటూ పవర్ ఫుల్ కోట్‌ను షేర్ చేశారు. తనలోని మరో కోణాన్ని ఆవిష్కరించేందుకు రామ్ పూర్తి స్థాయిలో సిద్ధమైనట్లు ఈ మాటలు చెబుతున్నాయి. భారీ అంచనాలు నెలకొన్న ఈ చిత్రం డిసెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది.

## ఆత్మహత్యలు కావు..వ్యవస్థలు చేసిన హత్యలు

### నీట్ విద్యార్థుల ఆత్మహత్యపై రాహుల్ ఆందోళన

### ప్రభుత్వం ఎప్పుడు కళ్లు తెరుస్తుందని ప్రశ్న

**బలగం టీవీ, హైదరాబాద్**

నీట్ పరీక్షల రద్దుతో ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థులవి వ్యవస్థలు చేసిన హత్యలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నీట్ పరీక్షలకు సంబంధించిన ఆత్మహత్య ఘటనలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల కుంభకోణాలు, అవినీతి కారణంగా విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతోందని ఆరోపించారు. సోషల్ మీడియా వేదికగా రాహుల్ గాంధీ పోస్టు పెట్టారు. లఖింపూర్ ఖేరీకి చెందిన 22 ఏళ్ల హృతిక్ మిశ్రా చివరిసారిగా 'నేను ఇకపై పోటీ పరీక్షలు రాయను' అని చెప్పిన మాటలను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ భావోద్వేగానికి గురయ్యారు. మూడోసారి నీట్ పరీక్ష రాస్తున్న హృతిక్, పరీక్ష రద్దు కావడంతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. అలాగే ఉనీజీలో కూడా నీట్ పరీక్ష రాసిన మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తుచేశారు. ఈ ఘటనలు కేవలం ఆత్మహత్యలు కావని, అవినీతి వ్యవస్థ చేసిన హత్యలని రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పరీక్ష చేతిలో విద్యార్థులు ఓడిపోలేదు.. అవినీతి వ్యవస్థ చేతిలో బలయ్యారని అన్నారు. 2015 నుంచి 2026 వరకు దేశవ్యాప్తంగా 148 పరీక్షల కుంభకోణాలు వెలుగుచూశాయని ఆయన ఆరోపించారు. వాటిలో 87 పరీక్షలు రద్దయ్యాయని, దాదాపు 9 కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రభావితమైందని పేర్కొన్నారు. ఈ 148 కుంభకోణాల్లో కేవలం ఒక్కరికే శిక్ష పడిందని, సీబీఐ 17 కేసులు, ఈడీ 11 కేసులు నమోదు చేసినప్పటికీ ఎవరూ బాధ్యత వహించలేదని విమర్శించారు. ప్రత్యేకంగా నీట్, ఏఐపీఎంటీ మరియు ఇతర వైద్య ప్రవేశ పరీక్షల్లోనే 15 కుంభకోణాలు జరిగాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యవహారాల్లో బాధ్యులైన అధికారులు, మంత్రులు రాజీనామా చేయకపోవడం అత్యంత సిగ్గుచేటని అన్నారు. కొందరిని తొలగించినట్లు చూపించి, తిరిగి ఉన్నత పదవుల్లో నియమిస్తున్నారని ఆరోపించారు. మోసానికి సహకరించే వారికి బహుమతులు లభిస్తుండగా, పరీక్షలు రాసే పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారు అంటూ కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాని మోడీని ఉద్దేశించి, మీలో జవాబుదారీతనం మేల్కొనడానికి ఇంకా ఎంతమంది హృతిక్‌లు కావాలని ప్రశ్నించారు. విద్యార్థుల బాధ తన బాధ అని, వారి భవిష్యత్తును దోచుకున్న వారు తప్పకుండా సమాధానం చెప్పాల్సి ఉంటుందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఎంత కాలం పట్టినా సరే, ఎవరినీ వదిలిపెట్టం. ఈ యుద్ధాన్ని మనం కలిసి పోరాడదాం.. మనం గెలుస్తాం అంటూ ధైర్యాన్ని ఇచ్చారు.

## రాహుల్ విదేశీ పర్యటనలపై కిరణ్ రిజిజు అభ్యంతరం

### పార్లమెంట్‌కు సమాచారం ఇవ్వండ లేదన్న కేంద్రమంత్రి

**బలగం టీవీ, హైదరాబాద్**

లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శుక్రవారనాడు ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటరీ నిబంధనలను రాహుల్ పాటించాలని, నిబంధనల ప్రకారం విదేశీ పర్యటనలకు ముందు లోక్‌సభ లేదా రాజ్యసభ సెక్రటేరియట్‌కు ఆ వివరాలు తెలియజేయాల్సి ఉంటుందని శుక్రవారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. రాహుల్ విదేశీ పర్యటనలు చేసే హక్కును తాము నిరోధించడం లేదని, అయితే సమాచారం మాత్రం ఇవ్వాలని కోరుతున్నామని కిరణ్ రిజిజు చెప్పారు. 'ప్రతి ఎంపీ విదేశీ పర్యటనలకు వెళ్లొచ్చు. కానీ మూడు వారాల ముందు సమాచారం ఇవ్వాలి. రాహుల్ గాంధీని ఆహ్వానించే ఏజెన్సీలు, సంస్థలు ఆ ఖర్చులు పెట్టుకోవచ్చు. అయితే అది విదేశీ కంట్రిబ్యూషన్ (నియంత్రణ) చట్టం కిందకు వస్తుంది. అందువల్ల ఆ సమాచారాన్ని హోం శాఖకు షేర్ చేయాల్సి ఉంటుంది' అని అన్నారు. రాహుల్ గాంధీ 2004లో తొలిసారి ఎంపీ అయినప్పటి నుంచి 54 సార్లు విదేశీ పర్యటనలు చేసినట్టు రిజిజు చెప్పారు. '54 పర్యటనలకే అది పరిమితం కాదు. ఎన్నిరోజులు ఆయన విదేశాల్లో ఉన్నారు, ఖర్చుల సంగతేమిటి? ఇవన్నీ లెక్కల్లోకి వస్తాయి. ఆ దృష్ట్యా రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ నిబంధనలు పాటించి తగిన సమాచారాన్ని అధికారులకు ఇవ్వాలి. మూడు వారాలకు ముందే ప్రతిపాదిత పర్యటనను లోక్‌సభ స్పీకర్‌కు చెప్పాలి. విదేశీ అతిథ్యాన్ని ఆయన అంగీకరించి ఉంటే ఆ విషయాన్ని ఎఫ్‌సీఆర్ఏ కింద హోం శాఖకు తెలియజేయాల్సి ఉటుంది' అని వివరించారు. చట్టం అనేది అందరికీ సమానమేనని, కేవలం లోక్‌సభ విపక్షనేతను ఉద్దేశించి తాను ఈ విజ్ఞప్తి చేయడం లేదని చెప్పారు. దేశంలో అమల్లో ఉన్న చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని

# ఎట్టకేలకు థియేటర్లలోకి కురుప్పు

**బలగం టీవీ, హైదరాబాద్**

తమిళ స్టార్ హీరో సూర్య నటించిన భారీ చిత్రం 'కరుప్పు' విడుదలకు ఎట్టకేలకు అడ్డంకులు తొలగాయి. గత కొన్ని రోజులుగా ఈ సినిమా విడుదలపై నెలకొన్న అనిశ్చితి అభిమానులను, నిర్మాతలను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. అయితే అన్ని సమస్యలు సద్దుమణగడంతో సినిమా ప్రపంచవ్యాప్తంగా మే 15, శుక్రవారం థియేటర్లలో సందడి చేసింది. తెలుగులో ఈ సినిమా 'వీరభద్రుడు' పేరుతో విడుదల అవుతోంది. సినిమా విడుదల సందర్భంగా సూర్య అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డియర్ ఆల్.. మాతో ఉన్నందుకు ధన్యవాదాలు. ఈరోజు నుంచి 'కరుప్పు', 'వీరభద్రుడు' థియేటర్లలో విడుదల అవుతున్నాయి' అంటూ ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ సందేశం అభిమానుల్లో ఆనందాన్ని నింపుతోంది. మొదట ఈ చిత్రాన్ని మే 14న విడుదల చేయాలని భావించినప్పటికీ, చివరి నిమిషంలో కొన్ని కారణాలతో విడుదల వాయిదా పడింది. దీంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ప్రేక్షకులకు క్షమాపణలు తెలిపింది. కొన్ని ప్రయాణాలు కాలాన్ని మాత్రమే కాదు.. మనసును కూడా పరీక్షిస్తాయి. సినిమా కోసం ఎదురుచూసిన ప్రతి ఒక్కరికీ మేము క్షమాపణలు చెబుతున్నాం. విడుదలలో జరిగిన ఆలస్యం మమ్మల్ని కూడా బాధించింది. అయినప్పటికీ మాపై మీరు చూపించిన నమ్మకం, ప్రేమ మాకు ఎంతో బలం ఇచ్చాయి అంటూ నిర్మాణ సంస్థ భావోద్వేగ ప్రకటన విడుదల చేసింది. అలాగే 'కరుప్పు' కేవలం తమ సినిమా మాత్రమే కాదని, ప్రేక్షకులందరి కథ అని పేర్కొంది. ఎన్నో కష్టాలు, నిద్రలేని రాత్రుల తర్వాత ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని తెలిపింది. తమిళనాడు, తెలుగు రాష్ట్రాల్లో విడుదల ఆగిపోయిన సమయంలో ముంబై, పుణెలోని కొన్ని థియేటర్లలో సినిమా ప్రదర్శన జరిగినట్లు సమాచారం రావడంతో నిర్మాతలు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో సినిమా పైరసీకి గురయ్యే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు. సూర్య




సరసన త్రిష హీరోయిన్‌గా నటించింది. ఈ చిత్రానికి ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించారు. సంగీతాన్ని సాయి అభ్యంకర్ అందించారు.

# పెద్ది ప్రమోషన్లలో కొత్త ఎమోషన్




### బుచ్చిబాబును లాంగ్ డ్రైవ్ తీసుకెళ్లిన రామ్‌చరణ్

**బలగం టీవీ, హైదరాబాద్**

రామ్ చరణ్, బుచ్చిబాబు కాంబినేషన్‌లో వస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'పెద్ది' విడుదలకు సిద్ధమవుతోంది. జూన్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో, చిత్ర యూనిట్ ప్రమోషన్ల స్పీడ్ పెంచింది. సినిమాపై హైప్ క్రియేట్ చేసేందుకు సరికొత్తగా ప్లాన్ చేస్తోంది. తాజాగా హీరో రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు ప్రచారంలో భాగంగా ఒక ప్రత్యేకమైన ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అయితే ఇది మామూలు ఇంటర్వ్యూలా కాకుండా, రామ్ చరణ్ స్వయంగా కారు డ్రైవ్ చేస్తూ బుచ్చిబాబును ఒక షికారుకి తీసుకెళ్లారు. ప్రయాణంలోనే వీరిద్దరూ సినిమా ముచ్చట్లను పంచుకున్నారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ.. సినిమా పనులతో ఇంత బిజీగా ఉన్నప్పటికీ, నన్ను ఇలా లాంగ్ డ్రైవ్‌కు తీసుకువచ్చినందుకు థాంక్యూ చరణ్ సార్ అంటూ తన ఆనందాన్ని పంచుకున్నారు. దానికి చరణ్ స్పందిస్తూ.. 'అదంతా సరే కానీ, మన 'పెద్ది' సినిమా ఎప్పుడు వస్తుందో ప్రేక్షకులకు కచ్చితంగా చెప్పు' అని నవ్వుతూ అడిగారు. దీంతో వీరిద్దరూ కలిసి జూన్ 4న 'పెద్ది' సినిమా థియేటర్లలోకి వస్తోందని అధికారికంగా ప్రకటించారు. భారీ అంచనాలతో వస్తున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులందరూ థియేటర్లలో చూసి ఎంజాయ్ చేయాలని రామ్ చరణ్, బుచ్చిబాబు కోరారు

# పల్లెటూరి ప్రేమకథ దూరదర్శిని

**బలగం టీవీ, హైదరాబాద్**




ప్రస్తుత కాలంలో సినిమా విజయాన్ని బడ్జెట్ నిర్ణయించడం లేదు, కేవలం కంటెంట్ మాత్రమే శాసిస్తోంది. బలమైన కథాంశంతో వస్తున్న చిన్న చిత్రాలు కూడా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను సాధిస్తూ సంచలనం సృష్టిస్తున్నాయి. సరిగ్గా అదే బాటలో, కేవలం కథనే నమ్ముకుని ఈ వారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం 'దూరదర్శిని'. టైటిల్‌తోనే సగటు ప్రేక్షకుడిలో పాత జ్ఞాపకాలను తట్టిలేపిన ఈ సినిమా, థియేటర్లలో సందడి చేస్తోంది. చిత్ర కథ మట్టపర్రు అనే పచ్చని పల్లెటూరి చుట్టూ తిరుగుతుంది. ఊరిలో కుల రాజకీయాలు, అంతరాలు ఉన్నప్పటికీ.. హరి (సువీక్షిత్), వాణి (గీతికా రతన్) చిన్నప్పటి నుండి ఒకరినొకరు ఇష్టపడతారు. ప్రతి శుక్రవారం దూరదర్శినిలో వచ్చే చిత్రలహరిని చూడటానికి వెళ్లే క్రమంలో వీరి మధ్య ప్రేమ చిగురిస్తుంది. అయితే, ఊరిలో పలుకుబడి ఉన్న వ్యక్తి, వాణి అన్నయ్య అయిన పరశురామ్‌తో హరికి గొడవ జరగడంతో వీరి ప్రేమాయణం మలుపు తిరుగుతుంది. పేదవాడైన హరి, పెత్తందారీ కుటుంబానికి చెందిన వాణిని ఎలా దక్కించుకున్నాడు? వీరి ప్రేమ కథకు కుల సమీకరణాలు ఎలా అడ్డంకిగా మారాయి? అనేదే ఈ సినిమా ఇతివృత్తం. దర్శకుడు కార్తికేయ 1990ల నాటి గ్రామీణ వాతావరణాన్ని, అప్పటి మనుషుల భావోద్వేగాలను అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించారు. ముఖ్యంగా 'దూరదర్శిని' అనేది కేవలం టైటిల్ మాత్రమే కాకుండా, కథలో ఒక కీలక పాత్రలా సాగుతుంది. ప్రథమార్ధంలో హీరో హీరోయిన్ల మధ్య సాగే సన్నివేశాలు నెమ్మదిగా సాగినప్పటికీ, పల్లెటూరి అందాలు, అల్లరి చిల్లర కామెడీ ప్రేక్షకులను అలరిస్తాయి. విరామ సమయానికి కథలో వేగం పుంజుకుంటుంది. ద్వితీయార్ధంలో కుల వివక్ష వల్ల కలిగే పరిణామాలు, భావోద్వేగపూరితమైన సన్నివేశాలు సినిమాను నిలబెట్టాయి. క్లైమాక్స్‌లో వచ్చే ట్విస్ట్ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది.నూతన నటీనటులైన సువీక్షిత్, గీతికలు తమ నటనతో ఆకట్టుకున్నారు. తొలి చిత్రమే అయినా ఎంతో పరిణతితో నటించి పాత్రలకు ప్రాణం పోశారు. ఇక హీరో స్నేహితులుగా నటించిన భద్ర, బలరామ్ గ్యాంగ్ పండించిన కామెడీ అక్కడక్కడా నవ్వులు పూయిస్తుంది. విలనిజం పండించిన పరశురాం తన గంభీరమైన నటనతో మెప్పించారు.

## హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులు

### రైల్వేశాఖతో కలసి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

### అధికారులను ఆదేశించిన సిఎస్ రామకృష్ణారావు

**బలగం టీవీ, హైదరాబాద్**



హైదరాబాద్ కేంద్రంగా ప్రతిపాదిత హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం డా.బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర రైల్వే శాఖ భాగస్వామ్యంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు రిపోర్టులు, ప్రాజెక్టు అమలులో అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో కలసి పనిచేయాలని, ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, కనెక్టివిటీ, మౌలిక వసతుల అభివృద్ధి, ఇతర అంశాలపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ నుండి ముంబై, చెన్నై, బెంగళూరు ప్రధాన నగరాలకు అనుసంధానించే హై స్పీడ్ రైల్ ప్రాజెక్టు వలన తెలంగాణ రైజింగ్ 2047 ఎకనామిక్ గ్రోత్ కారిడార్ గా అభివృద్ధి చెందే అవకాశం ఉందని సి.ఎస్ పేర్కొన్నారు. దేశంలో వేగవంతమైన రవాణా వ్యవస్థకు హై స్పీడ్ రైలు ప్రాజెక్టు నిలుస్తుందని, ప్రజల భవిష్యత్ అవసరాలకు, పారిశ్రామిక, ఐటి, పర్యాటక రంగాలలో అభివృద్ధికి ఈ ప్రాజెక్ట్ ఉపకరిస్తుందని సి.ఎస్ తెలిపారు. హైదరాబాద్, పూనే,ముంబై హై స్పీడ్ రైల్ మార్గానికి సంబంధించి డి.పి.ఆర్ సిద్ధం అయ్యిందని రైల్వే అధికారులు తెలిపారు. సూమారు 671 కి. మీటర్ల మార్గానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, తెలంగాణ రాష్ట్రంలో 93 కి. మీటర్ల మేరకు భూ సేకరణ అవసరం ఉంటుందని, అదేవిధంగా హైదరాబాద్ - బెంగళూరు కారిడార్, హైదరాబాద్- చెన్నై కారిడార్ లో సూమారు 123 కి.మీటర్ల నిడివిలో భూసేకరణ అవసరమని, కోకాపేట, శంషాబాద్ ప్రాంతాలలో రైల్వే డిపోలకు కొంత భూసేకరణ చేయాలని అధికారులు పేర్కొన్నారు. వీటికి సంబంధించి రోడ్లు, భవనాల శాఖ, హెచ్.యం.డి.ఎ, జీఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు కేంద్ర రైల్వే ప్రాజెక్టు అధికారులతో సమన్వయం చేసుకొని హై స్పీడ్ రైలు ప్రాజెక్ట్ కు సహకరించాలని సి.ఎస్ అన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, ఊఓఆం మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, కేంద్ర రైల్వే శాఖ అధికారులు, జీఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు పాల్గొన్నారు.

## జవహర్ నగర్ దోపిడీ కేసులో పురోగతి

### ప్రధాన నిందితులను పట్టుకున్న పోలీసులు

**బలగం టీవీ, హైదరాబాద్**

జవహర్‌నగర్ నేపాలీ ముఠా దోపిడీ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న మమత అలియాస్ మీనా కడాయత్, ఆమె భర్త రమేశ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నేపాల్ సరిహద్దుల్లో ఈ దంపతులు అరెస్ట్ అయ్యారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో నలుగురి కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. చోరీ జరిగిన రోజు యజమాని ద్విచక్ర వాహనాన్ని తీసుకుని దుండగులు పరారయ్యారు. ఆ బైక్‌ను యాప్రాల్లోని పెట్రోల్ బంకు వద్ద వదిలి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ఏజెంట్ భీమ్‌ను పోలీసులు విచారిస్తున్నారు. ప్రధాన నిందితులను రేపటిలోగా హైదరాబాద్‌కు తరలించనున్నట్లు సమాచారం. అలాగే ఈ కేసులో మిగిలిన నిందితులు నేపాల్‌లో తలదాచుకున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కౌకూరు గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో రిటైర్డ్ ప్రొఫెసర్ మురళీధర్ మోహన్ దంపతులను బంధించి.. నేపాలీ ముఠా దోపిడీకి పాల్పడిన విషయం తెలిసిందే. దాదాపు 75 తులాల బంగారం, 20 కిలోల వెండితో దుండగులు పరారయ్యారు. ఈ దోపిడీపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## యువతి మోసగించిందని వ్యక్తి ఆత్మహత్య

### రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొహెడలో ఘటన

**బలగం టీవీ, హైదరాబాద్**

సహజీవనం చేసిన మహిళ మోసగించిందని ఆరోపిస్తూ ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొహెడలో ఈ ఘటన చోటుచేసుకుంది. యువతి మోసం చేసిందంటూ వీడియో రికార్డు చేసి గోవర్ధన్ అనే వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. నాలుగేళ్లుగా గోవర్ధన్, ఆ యువతి సహజీవనం చేస్తున్నారు. పుట్టిన కుమారుడిని ఆమె విక్రయించి మరో వివాహం చేసుకుందని వీడియోలో గోవర్ధన్ ఆరోపించాడు. అతడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సీఎస్కేపై లక్నో ఘన విజయం!

**మిచెల్ మార్ష్ విధ్వంసకర బ్యాటింగ్..**

**చెన్నై ప్లేఆఫ్స్ ఆశలు సంక్లిష్టం**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా శుక్రవారం రాత్రి జరిగిన కీలక పోరులో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు అద్భుత విజయాన్ని అందుకుంది. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే)తో జరిగిన ఈ మ్యాచ్‌లో లక్నో 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి, సీఎస్కే ప్లేఆఫ్స్ ఆశలను గట్టిగా దెబ్బతీసింది. సీఎస్కే నిర్దేశించిన 188 పరుగుల భారీ లక్ష్యాన్ని లక్నో జట్టు కేవలం 16.4 ఓవర్లలోనే ఛేదించి అందరినీ ఆశ్చర్యపరిచింది.

**మార్ష్ మెరుపు ఇన్నింగ్స్.. త్రుటిలో సెంచరీ మిస్**

లక్నో భారీ విజయానికి ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ లీడ్ రోల్ పోషించాడు. చెన్నై బౌలర్లపై విరుచుకుపడుతూ కేవలం 38 బంతుల్లోనే 236.84 స్ట్రైక్ రేట్‌తో 90 పరుగులు బాదాడు. మార్ష్ ఇన్నింగ్స్‌లో 9 ఫోర్లు, 7 సిక్సర్లు ఉన్నాయి. అయితే, దురదృష్టవశాత్తూ రనౌట్ కావడంతో ఈ సీజన్‌లో తన రెండో సెంచరీని కేవలం 10 పరుగుల దూరంలో మిస్ చేసుకున్నాడు. మార్ష్‌కు తోడుగా జోష్ ఇంగ్లిస్ 36 పరుగులతో రాణించాడు. చెన్నై బౌలర్లలో స్పెన్సర్ జాన్సన్, ముఖేష్ చౌదరి తలో వికెట్ పడగొట్టినప్పటికీ లక్నో పరుగుల జోరును అడ్డుకోలేకపోయారు.

**రాణించిన కార్తీక్ శర్మ.. కట్టడి చేసిన ఆకాష్**

అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన సీఎస్కే నిర్ణీత ఓవర్లలో 187 పరుగులు చేయగలిగింది. ఆరంభంలో సంజు శాంసన్ (20), కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (9) విఫలమైనప్పటికీ.. యువ బ్యాటర్ కార్తీక్ శర్మ (42 బంతుల్లో 71 పరుగులు) హాఫ్ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. కార్తీక్, బ్రెవిస్ (25) కలిసి నాలుగో వికెట్‌కు 70 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. చివర్లో శివమ్ దూబే 16 బంతుల్లో 32 పరుగులు చేసి స్కోరును 187కు చేర్చాడు. లక్నో బౌలర్లలో ఆకాష్ మహరాజ్ సింగ్ 3 వికెట్లతో చెన్నైని కట్టడి చేశాడు.



**చెన్నై ప్లేఆఫ్స్ సమీకరణాలు ఇవే..**

ఈ ఓటమితో సీఎస్కే ప్లేఆఫ్స్ అవకాశాలు అత్యంత సంక్లిష్టంగా మారాయి. ఇప్పటివరకు 12 మ్యాచ్‌లు ఆడిన చెన్నై 6 విజయాలు, 6 ఓటములతో 12 పాయింట్ల వద్ద నిలిచింది.

మిగిలిన మ్యాచ్‌లు: ప్లేఆఫ్స్‌కు చేరుకోవాలంటే సీఎస్కే తన మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో కచ్చితంగా గెలవాలి. అప్పుడు జట్టుకు 16 పాయింట్లు వస్తాయి.

ఇతర జట్లపై ఆధారపడాల్సిందే: కేవలం గెలిస్తేనే సరిపోదు. పంజాబ్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తమ మిగిలిన మ్యాచ్‌ల్లో కనీసం ఒక్కటైనా ఓడిపోవాలని చెన్నై కోరుకోవాలి.

ఇప్పటికే ఆర్సీబీ, గుజరాత్ జట్లు 16 పాయింట్లతో ముందంజలో ఉండటంతో సీఎస్కేకు దారులు క్లిష్టంగా మారాయి.



# బుమ్రా సారథ్యంలో అరుదైన మైలురాయి!

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఐపీఎల్ 2026 సీజన్‌లో ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ ఒక విలక్షణమైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. గురువారం ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా టాస్ వేయడానికి రావడంతో ఈ అరుదైన ఘనత సాధ్యమైంది. రెగ్యులర్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా వెన్నునొప్పి కారణంగా ఈ మ్యాచ్‌కు దూరం కాగా, స్టాండ్-ఇన్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వ్యక్తిగత కారణాల వల్ల అందుబాటులో లేడు. దీనితో బుమ్రా తన ఐపీఎల్ కెరీర్‌లో తొలిసారి నాయకత్వ బాధ్యతలు చేపట్టాడు. ఒకే సీజన్‌లో ముగ్గురు వేర్వేరు భారతీయ ఆటగాళ్లు (హార్దిక్, సూర్య, బుమ్రా) కెప్టెన్లుగా వ్యవహరించడం ఐపీఎల్ చరిత్రలోనే ఇదే మొదటిసారి. ఐపీఎల్ చరిత్రలో ఒకే సీజన్‌లో ముగ్గురు కెప్టెన్లను మార్చిన ఐదో జట్టుగా ముంబై నిలిచింది. గతంలో 2008లో ముంబై తరపున హర్భజన్ సింగ్, షాన్ పొల్లాక్, సచిన్ టెండూల్కర్ కెప్టెన్లుగా ఉండగా, ఆ తర్వాత పుణే వారియర్స్ ఇండియా (2013), సన్ రైజర్స్ హైదరాబాద్ (2021), పంజాబ్ కింగ్స్ (2024) ఈ జాబితాలో చేరాయి. అయితే పైన పేర్కొన్న జట్లన్నీ భారతీయులు ఇంకా విదేశీ ఆటగాళ్ల కలయికతో కెప్టెన్లను మార్చగా, ముంబై ఇండియన్స్ మాత్రం ఈసారి ముగ్గురు భారతీయులకే ఆ బాధ్యతలు అప్పగించి సరికొత్త ట్రెండ్ సెట్ చేసింది. వరుస గాయాలు, సీనియర్ల గైర్హాజరీ వల్ల ఈ పరిస్థితి తలెత్తినప్పటికీ, ఇది ముంబై టీమ్ లో ఉన్న లీడర్‌షిప్ డెప్త్‌ను తెలియజేస్తోంది. జస్ప్రీత్ బుమ్రా కెప్టెన్సీ అరంగేట్రం కోసం చాలా కాలం వేచి చూడాల్సి వచ్చింది. ఏకంగా 156 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన తర్వాత ఆయనకు కెప్టెన్ అయ్యే అవకాశం దక్కింది. లీగ్ చరిత్రలో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన తర్వాత కెప్టెన్సీ బాధ్యతలు తీసుకున్న రెండో ఆటగాడిగా బుమ్రా నిలిచాడు. ఈ లిస్టులో రవీంద్ర జడేజా 200 మ్యాచ్‌లతో టాప్ లో ఉండగా, ఇప్పుడు బుమ్రా మనీష్ పాండే (153), అక్షర్ పటేల్ (148), కీరన్ పొలార్డ్ (137) వంటి దిగ్గజాలను వెనక్కి నెట్టాడు. టాస్ సమయంలో బుమ్రా ఒక చమత్కారమైన కామెంట్ కూడా చేశాడు. ముంబైకి కెప్టెన్ కాకముందే టీమిండియా టెస్ట్ టీమ్ కు కెప్టెన్ అవుతానని ఎప్పుడూ అనుకోలేదని నవ్వుతూ చెప్పిన మాటలు సోషల్ మీడియాలో హైలైట్ అవుతున్నాయి. ఈ 2026 సీజన్ ముంబై ఇండియన్స్ జట్టుకు అస్సలు కలిసి రావడం లేదు. వరుస ఓటములతో పాటు నాయకత్వ మార్పులు జట్టును ఇబ్బంది పెడుతున్నాయి. టీమ్ లోని కోర్ గ్రూప్ అలాగే ఉన్నా, కెప్టెన్సీలో స్థిరత్వం లేకపోవడం వల్ల మైదానంలో ప్లానింగ్ కష్టంగా మారుతోంది. అయితే ఈ క్లిష్ట పరిస్థితుల్లో కూడా బుమ్రా కెప్టెన్‌గా రావడంతో అభిమానుల్లో కొత్త ఆశలు చిగురించాయి. ప్రధాన కోచ్ మాహేల జయవర్ధనే పర్యవేక్షణలో ఉన్న ఈ టీమ్, కనీసం మిగిలిన మ్యాచ్‌ల్లో గెలిచి తమ గౌరవాన్ని కాపాడుకోవాలని చూస్తోంది. ప్లేఆఫ్స్ రేసులో నుంచి ఔట్ అయినప్పటికీ, బుమ్రా లాంటి అగ్రెసివ్ బౌలర్ నాయకత్వంలో ముంబై కొత్త ఉత్సాహంతో ఆడుతుందనే అంచనాలు ఉన్నాయి.

# ఎస్ఆర్‌హెచ్ ఆర్సీబీ ధరల పెంపుపై ఆగ్రహం



**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా జరగనున్న మే 22న సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లను తాజాగా విడుదల చేసింది సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ. అయితే ఈ సన్‌రైజర్స్, బెంగళూరు మ్యాచ్ టికెట్ల వ్యవహారం ప్రస్తుతం తీవ్ర దుమారం రేపుతోంది. విరాట్ కోహ్లీ, ప్యాట్ కమిన్స్ వంటి స్టార్ల పోరును చూడాలని ఆశపడ్డ అభిమానులకు ఇప్పుడు పెద్ద షాకే తగిలింది. మే 22న జరగనున్న ఈ హై-వోల్టేజ్ మ్యాచ్ కోసం నేడు అనగా గురువారం సాయంత్రం 5 గంటలకు టికెట్ల విక్రయాలు ప్రారంభమయ్యాయి. బుకింగ్ ప్రారంభమైన నిమిషాల్లోనే సుమారు 6 లక్షల మంది ఆన్‌లైన్ క్యూలో చేరడం విశేషం. భారీ ట్రాఫిక్ కారణంగా సర్వర్లు మొరాయించడంతో గంటల తరబడి వేచి చూసినా చాలా మందికి టికెట్లు దక్కలేదు. కొద్దిసేపటికే 'సోల్డ్ ఔట్' బోర్డు కనిపించడంతో ఫ్యాన్స్ అవాక్కయ్యారు. ఈ మ్యాచ్‌కు ఉన్న క్రేజ్‌ను క్యాష్ చేసుకునేందుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ ( ఫ్రాంచైజీ టికెట్ల ధరలను భారీగా పెంచేసింది. దీనిపై అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత మ్యాచ్‌ల్లో రూ.750 గా ఉన్న కనీస టికెట్ ధరను ఈసారి రూ.1,950కి పెంచారు. సామాన్య అభిమానులకు భారంగా మారేలా ఇతర గ్యాలరీల ధరలను కూడా భారీగా పెంచడంపై సోషల్ మీడియాలో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. టికెట్ల కేటాయింపులో పారదర్శకత లేదని, అంతర్గతంగా భారీగా అక్రమాలు జరుగుతున్నాయని క్రీడా ప్రేమికులు మండిపడుతున్నారు. అధికారిక వెబ్‌సైట్‌లో నిమిషాల్లోనే మాయమైన టికెట్లు, బయట బ్లాక్ మార్కెట్‌లో విపరీతమైన ధరలకు లభిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కావాలనే టికెట్లను హోల్డ్‌లో పెట్టి, కృత్రిమ డిమాండ్ సృష్టిస్తున్నారని అభిమానులు విమర్శిస్తున్నారు.

# పంజాబ్ కింగ్స్ ప్లే ఆఫ్స్ అవకాశాలు క్లిష్టం

**బలగం టీవీ, హైదరాబాద్**

కచ్చితంగా నెగ్గాల్సిన మ్యాచ్ లో గతేడాది ఫైనలిస్టు పంజాబ్ కింగ్స్ మళ్లీ ఉస్సూరుమనిపించింది. వరుసగా ఐదో పరాజయంతో ప్లే ఆఫ్స్ అవకాశాలను క్లిష్టం చేసుకుంది. గురువారం ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్ తో జరిగిన మ్యాచ్ లో 6 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. అంతకుముందు సొంతగడ్డ ధర్మశాలలో జరిగిన మ్యాచ్ లో టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 200 పరుగులు చేసింది.

ఓపెనర్ ప్రభ్ సిమ్రాన్ సింగ్ స్టన్నింగ్ ఫిఫ్టీ (32 బంతుల్లో 587, 6 ఫోర్లు, 4 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ నాలుగు వికెట్లతో సత్తా చాటాడు. అనంతరం ఛేజింగ్ ను ముంబై చివరి ఓవర్లో ఛేదించింది. 19.5 ఓవర్లలో 4 వికెట్లకు 205 పరుగులు చేసింది. తెలుగు స్టార్ తిలక్ వర్మ సూపర్బ్ ఫిఫ్టీ ( 33 బంతుల్లో 75 నాటౌట్, 6 ఫోర్లు, 6 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో అజ్మతుల్లా ఒమర్ జాయ్ కు రెండు వికెట్లు దక్కాయి. ఈ విజయంతో ముంబైకి ఓదార్పు విజయం దక్కింది. మరోవైపు వరుసగా ఐదో పరాజయంతో ప్లే ఆఫ్ అవకాశాలను ప్రమాదంలో పడేసుకుంది పంజాబ్. శుక్రవారం జరిగే మ్యాచ్ లో చెన్నై సూపర్ కింగ్స్ తో లక్నో సూపర్ జెయింట్స్ తలపడనుంది. భారీ టార్గెట్ తో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ కు ఓపెనర్లు వెటరన్ రోహిత్ శర్మ (25), ర్యాన్ రికెల్టన్ (23 బంతుల్లో 48, 4 ఫోర్లు, 4 సిక్సర్లు) శుభారంభం అందించారు. ముఖ్యంగా ఆరంభంలో ఎక్కువగా స్ట్రైక్ తీసుకున్న రికెల్టన్ దడదడలాడించాడు. ఫోర్లు, సిక్సర్లతో చెలరేగుతూ పంజాబ్ బౌలర్లను ఒత్తిడిలిఓకి నెట్టాడు. దీంతో తొలి వికెట్ కు 61 పరుగుల శుభారంభం దక్కింది. పవర్ ప్లేలో ముంబై 59 పరుగులు చేయగా, అందులో సింహభాగం రికెల్టన్ చేసినవే కావడం విశేషం. ఇక పవర్ ప్లే ముగిసిన తర్వాత ఓవర్లోనే రికెల్టన్ పెవిలియన్ కు చేరాడు. కాసేపటికే వరుస ఓవర్లలో నమన్ ధీర్ (9), రోహిత్ ఔట్ కావడంతో ముంబై కష్టాల్లో పడింది. పది ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయిన దశలో పీకల్లోతు కష్టాల్లో పడిన దశలో తిలక్ వర్మ, షెర్ఫేన్ రూథర్ ఫర్డ్ (20) ఆదుకున్నారు. వీరిద్దరూ ఆరంభంలో వేగంగా స్ట్రైక్ రొటేట్ చేస్తూ, పరుగులు సాధించారు. ఈ దశలో నెమ్మదిగా గేర్లు మార్చిన తిలక్.. భారీ సిక్సర్లతో అలరించాడు. యజ్వేంద్ చాహల్ బౌలింగ్ లో 106 మీటర్ల భారీ సిక్సర్ ను తిలక్ బాదడంతో ఏకంగా అది స్టేడియం బయట పడటం విశేషం. ఆ తర్వాత కీలక దశలో సిక్సర్లతో తను అలరించాడు. వీరిద్దరూ నాలుగో వికెట్ కు 61 పరుగులు జోడించడంతో ముంబై రేసులోకి వచ్చింది. ఈ దశలో రూథర్ ఫర్డ్ ఔటైనా, విల్ జాక్స్ (10 బంతుల్లో 25 నాటౌట్, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) తో కలిసి తిలక్.. జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఈ విజయంతో ముంబై టోర్నీలో నాలుగో విజయం సాధించింది. మరోవైపు మ్యాచ్ కు ముందు తిలక్ పై రేసియల్ కామెంట్ చేసిన అర్షదీప్ సింగ్ కు తన బ్యాట్ తో సమాధానమిచ్చాడని ముంబై అభిమానులు అంటున్నారు. మరోవైపు వరుసగా ఐదో పరాజయంతో డీలా పడిన పంజాబ్.. మిగతా రెండు మ్యాచ్ లు గెలిస్తేనే నాకౌట్ దశకు చేరే ప్రమాదంలో పడింది. అజేయ అర్ధ సెంచరీతో రాణించిన తిలక్ కే ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.





# అర్ష్‌దీప్ సింగ్‌పై నిషేధం విధించాలి

**టీమిండియా మాజీ స్పిన్నర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్**

**బలగం టీవీ, హైదరాబాద్**

జాతి వివక్ష వ్యాఖ్యలు చేసిన పంజాబ్ కింగ్స్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌పై నిషేధం విధించాలని టీమిండియా మాజీ స్పిన్నర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్ డిమాండ్ చేశాడు. ఈ సీజన్ మొత్తం ఆడకుండా చేయాలని బీసీసీఐని కోరాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌కు ముందు పంజాబ్ కింగ్స్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ షేర్ చేసిన ఓ వీడియో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ వీడియోలో తిలక్ వర్మను అర్ష్‌దీప్ సింగ్ కర్రోడా అని సంభోదించాడు. 'అరే ఓ కర్రోడా.. సన్‌స్క్రీన్ రాశావా?'అని అడిగాడు. అంతటితో ఆగకుండగా.. నమన్ ధీర్‌ను అందగాడని అభివర్ణించాడు. ఈ వీడియో నెట్టింట తీవ్ర దుమారం రేపింది. కొందరు ఈ వీడియోను సరదాగా తీసుకొన్న మరికొందరు మాత్రం జాతి వివక్ష వ్యాఖ్యలుగా పేర్కొంటూ అర్ష్‌దీప్ సింగ్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఎక్స్ వేదికగా స్పందించిన శివరామకృష్ణన్.. అర్ష్‌దీప్ సింగ్‌పై నిషేధం విధించాలని బీసీసీఐని డిమాండ్ చేశాడు. ఇలాంటి ఘటనలను డ్రెస్సింగ్ రూమ్ జోక్స్‌గా కొట్టిపారేస్తే ఇలాంటి సమస్యలు ఎక్కువ అవుతాయని అభిప్రాయపడ్డాడు. 'తిలక్ వర్మ కెరీర్ ఆరంభంలో ఉంది. కాబట్టి ఈ జాతి వివక్ష వ్యాఖ్యలపై స్పందించడు. కానీ బీసీసీఐ.. ఈ వీడియో ప్రూఫ్‌తో అర్ష్‌దీప్ సింగ్‌పై చర్యలు తీసుకోవచ్చు. ఇది ఏ మాత్రం ఆట కాదు.. ఇదో వృత్తి. జాతి వివక్ష గురించి చెబితే నన్ను ఎవరూ నమ్మలేదు. ప్రతీ ఒక్కరు నన్ను తిట్టడంతో పాటు ట్రోల్ చేశారు. అర్ష్‌దీప్ సింగ్‌ను ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లు ఆడకుండా నిషేధం విధించాలి. నేను మరోసారి ట్రోలింగ్ గురవుతానని తెలుసు. బీసీసీఐ చర్యలు తీసుకుంటుందంటే.. నా పట్ల జాతి వివక్ష వ్యాఖ్యలు చేసి వారి పేర్లు చెబుతాను. వారిపై బీసీసీఐ చర్యలు తీసుకుంటుందా? 'అని శివమరామకృష్ణ వరుస ట్వీట్స్ చేశాడు. ఈ ఘటన బీసీసీఐని ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెట్టింది. ఈ సీజన్ ప్రారంభానికి ముందే ఫ్రాంచైజీలకు ఆఫ్ ఫీల్డ్‌లో ఆటగాళ్ల ప్రవర్తనకు సంబంధించి ఏడు గైడ్‌లైన్స్‌ను బీసీసీఐ జారి చేసింది. ఈ క్రమంలో అర్ష్‌దీప్ సింగ్‌పై చర్యలు తీసుకుంటారా? లేక చూసి చూనట్లు వదిలేస్తారా? అనేది తీవ్ర చర్చనీయాంశమైంది.

## బీసీసీఐ రూల్స్‌లో ఊహించని ట్విస్ట్!

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ 2026 సీజన్ క్లైమాక్స్‌కు చేరుకుంది. మే 24తో లీగ్ దశ మ్యాచ్‌లు ముగియనుండగా.. మే 26 నుంచి ప్లేఆఫ్స్ సమరం మొదలవుతుంది. అయితే ఈ కీలక మ్యాచ్‌లకు వర్షం ముప్పు పొంచి ఉండటంతో క్రికెట్ అభిమానుల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో ప్లేఆఫ్ మ్యాచ్‌లకు సంబంధించి బీసీసీఐ రూపొందించిన ప్రత్యేక నిబంధనల గురించి తెలుసుకుందాం. సాధారణంగా నాకౌట్ మ్యాచ్‌లన్నింటికీ రిజర్వ్ డే ఉంటుందని అందరూ భావిస్తారు. కానీ బీసీసీఐ నిబంధనల ప్రకారం క్వాలిఫయర్-1, ఎలిమినేటర్, క్వాలిఫయర్-2 మ్యాచ్‌లకు రిజర్వ్ డేలు లేవు. కేవలం ఫైనల్ మ్యాచ్‌కు మాత్రమే రిజర్వ్ డే కేటాయించబడింది. అంటే మొదటి మూడు నాకౌట్ మ్యాచ్‌లను ఏ రోజున నిర్ణయించారో అదే రోజున ఫలితాన్ని తేల్చాల్సి ఉంటుంది. వర్షం పడితే ఆటను పూర్తి చేయడానికి లీగ్ మ్యాచ్‌ల కంటే అదనంగా 120 నిమిషాల సమయం కేటాయిస్తారు. ఒకవేళ ప్లేఆఫ్ మ్యాచ్ జరిగే రోజున వర్షం కురిస్తే అంపైర్లు మొదట 20 ఓవర్ల పూర్తి మ్యాచ్ నిర్వహించడానికి ప్రయత్నిస్తారు. అది సాధ్యం కాకపోతే ఓవర్లను తగ్గిస్తూ వచ్చి కనీసం 5 ఓవర్ల చొప్పున మ్యాచ్ జరిగేలా చూస్తారు. ఒకవేళ 5 ఓవర్ల మ్యాచ్ కూడా జరగని పక్షంలో కనీసం ఫలితం కోసం సూపర్ ఓవర్ నిర్వహించే అవకాశం ఉందో లేదో పరిశీలిస్తారు. మైదానం పరిస్థితి సహకరిస్తే సూపర్ ఓవర్ ద్వారా విజేతను నిర్ణయిస్తారు. అదనపు సమయం తర్వాత కూడా వర్షం తగ్గకపోతే లేదా సూపర్ ఓవర్ కూడా నిర్వహించే అవకాశం లేకపోతే, బీసీసీఐ నిబంధనల ప్రకారం లీగ్ దశలో సాధించిన పాయింట్ల పట్టిక కీలకంగా మారుతుంది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న జట్టును విజేతగా ప్రకటిస్తారు. ఉదాహరణకు, క్వాలిఫైయర్-1లో మొదటి, రెండో స్థానాల్లోని జట్ల మధ్య మ్యాచ్ వర్షం వల్ల రద్దయితే, టేబుల్ టాపర్‌గా ఉన్న జట్టును నేరుగా ఫైనల్‌కు పంపిస్తారు. ఎలిమినేటర్ మ్యాచ్‌లో కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. మిగిలిన మ్యాచ్‌లతో పోలిస్తే ఫైనల్‌కు రూల్స్ కాస్త సరళంగా ఉంటాయి. ఫైనల్ మ్యాచ్‌కు రిజర్వ్ డే ఉన్నందున నిర్ణీత రోజున వర్షం వస్తే మరుసటి రోజు ఆటను కొనసాగిస్తారు. ఒకవేళ ఫైనల్ రోజున మ్యాచ్ సగం జరిగాక ఆగిపోతే.. రిజర్వ్ డే నాడు అక్కడి నుంచే ఆట ప్రారంభమవుతుంది. రిజర్వ్ డే నాడు కూడా వర్షం కారణంగా కనీసం 5 ఓవర్ల ఆట లేదా సూపర్ ఓవర్ సాధ్యపడకపోతే, అప్పుడు లీగ్ దశలో పాయింట్ల పట్టికలో టాప్ ప్లేస్‌లో ఉన్న జట్టును ఐపీఎల్ 2026 ఛాంపియన్‌గా ప్రకటిస్తారు.

## విభేదాలు ఉంటే పరిష్కరించుకోవాలి

**టీమిండియా మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబయి ఇండియన్స్ పరిస్థితి నిరాశజనకంగా ఉంది. ఆట కంటే కూడా జట్టు లోపల జరుగుతున్న పరిణామాలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా కెప్టెన్ హార్దిక్ పాండ్య చుట్టూ ఏదో ఒక వివాదం తిరుగుతూనే ఉంది. నిన్న పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హార్దిక్ ఆడకపోవడంపై రకరకాల చర్చలు మొదలయ్యాయి. అధికారికంగా వెన్నునొప్పి అని చెబుతున్నా, తెర వెనుక కథ వేరే ఉందనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో టీమిండియా మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముంబయి మేనేజ్‌మెంట్ హార్దిక్ విషయంలో ఒక కఠినమైన నిర్ణయం తీసుకోవాలి అని సెహ్వాగ్ సూచించారు. ముంబయి ఇండియన్స్ డ్రెస్సింగ్ రూమ్‌లో హార్దిక్ పాండ్యకు, మిగిలిన ఆటగాళ్లకు మధ్య విభేదాలు ఉన్నాయనే వార్తలు గత కొంతకాలంగా వినిపిస్తున్నాయి. దీనిపై సెహ్వాగ్ స్పందిస్తూ ఒకవేళ ఈ రూమర్స్ నిజమైతే ముంబయి ఇండియన్స్ వెంటనే హార్దిక్‌ను జట్టు నుంచి రిలీజ్ చేయాలి అని అభిప్రాయపడ్డారు. జట్టులో క్రమశిక్షణ, సమన్వయం లేనప్పుడు ఎంతటి స్టార్ ప్లేయర్ ఉన్నా ప్రయోజనం ఉండదు అని సెహ్వాగ్ పేర్కొన్నారు. అయితే ఈ వార్తలు నిజమో కాదో తనకు తెలియదని, ఒకవేళ నిజం అని తేలితే మాత్రం కఠినంగా ఉండాలి అని ముంబయికి సూచించారు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యతో పాటు సూర్యకుమార్ యాదవ్ కూడా ఆడలేదు. దీంతో జస్ప్రీత్ బుమ్రా జట్టు పగ్గాలు చేపట్టారు. బుమ్రా కెప్టెన్సీలో ముంబయి అద్భుత విజయాన్ని అందుకుని ఈ సీజన్‌లో నాలుగో గెలుపును నమోదు చేసింది. హార్దిక్ లేకపోయినా జట్టు గెలవడంతో, ఆయన అవసరం టీమ్‌కు ఉందా లేదా అన్న చర్చ మొదలైంది. అయితే సెహ్వాగ్ మాత్రం క్రికెట్ పరంగా చూస్తే హార్దిక్ చాలా విలువైన ప్లేయర్ అని, కేవలం ఆటను బట్టి చూస్తే ఆయనను కచ్చితంగా రిటైన్ చేసుకోవాలి అని అన్నారు. సెహ్వాగ్ తన వివరణలో హార్దిక్ పాండ్య మార్కెట్ వాల్యూ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఐపీఎల్‌లో రిషబ్ పంత్ 27 కోట్లతో అత్యంత ఖరీదైన ఆటగాడిగా ఉన్నారు. హార్దిక్‌కు ఇప్పుడు వస్తున్న 16 కోట్లు చాలా తక్కువ అని, నిజానికి అతను కూడా 27 కోట్ల విలువైన ఆటగాడే అని సెహ్వాగ్ ప్రశంసించారు. హార్దిక్ గతంలో ముంబయిలో సాధారణ ప్లేయర్‌గా ఉన్నప్పుడు కూడా అద్భుతంగా రాణించారు అని, ఆయన ఆల్‌రౌండ్ ప్రతిభ జట్టుకు ఎప్పుడూ అవసరమే అని సెహ్వాగ్ గుర్తు చేశారు. డ్రెస్సింగ్ రూమ్‌లో తేడాలు ఉన్నాయనే వార్తలను సెహ్వాగ్ కొట్టిపారేయలేదు. ఒకవేళ చిన్న చిన్న మనస్పర్థలు ఉంటే వాటిని కూర్చుని మాట్లాడుకుని పరిష్కరించుకోవాలి అని ముంబయికి సలహా ఇచ్చారు. "క్రికెట్ అనేది టీమ్ గేమ్ అక్కడ విభేదాలకు తావు ఉండకూడదు. హార్దిక్ పాండ్య వంటి క్వాలిటీ ప్లేయర్ ముంబయిలో ఉండటం జట్టుకు ఎంతో బలం. వ్యక్తిగత ఇగోలను పక్కన పెట్టి జట్టు కోసం ఆడాలి" అని సెహ్వాగ్ సూచించారు. సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించి హార్దిక్ సేవలను వాడుకోవడమే తెలివైన పని అని ఆయన అభిప్రాయపడ్డారు. పంజాబ్‌తో మ్యాచ్‌కు హార్దిక్ దూరం అవ్వడంపై మేనేజ్‌మెంట్ చెబుతున్న కారణాలను చాలామంది నమ్మడం లేదు. కేవలం వెన్నునొప్పి వల్లనే అతను ఆడలేదా లేక కావాలనే పక్కన పెట్టారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హార్దిక్ కనిపించకపోవడం బుమ్రా కెప్టెన్‌గా రాణించడం, జట్టు గెలవడం ఈ అనుమానాలను మరింత బలపరుస్తున్నాయి. ముంబయికి ఇంకా రెండు మ్యాచులు మిగిలి ఉన్నాయి. ఈ మ్యాచులలో హార్దిక్ తిరిగి జట్టులోకి వస్తారా లేదా అన్నది ఇప్పుడు ఉత్కంఠగా మారింది. ఒకవేళ ఆయన ఆడకపోతే ఇక ముంబయిలో హార్దిక్ కెరీర్ ముగిసినట్లే అనే కామెంట్స్ బలంగా వినిపిస్తున్నాయి. సెహ్వాగ్ లాంటి సీనియర్ క్రికెటర్ హార్దిక్‌ను రిలీజ్ చేయాలి అని అనడం ముంబయి ఫ్యాన్స్‌లో హాట్ టాపిక్ గా మారింది. వచ్చే ఏడాది మెగా వేలం ఉన్న నేపథ్యంలో ముంబయి ఎవరిని రిటైన్ చేసుకుంటుంది అన్నది ఆసక్తికరంగా మారింది. రోహిత్ శర్మ, బుమ్రా, సూర్యకుమార్ యాదవ్ వంటి స్టార్ ప్లేయర్స్ ఉన్న జట్టులో హార్దిక్ నాయకత్వంపై వ్యతిరేకత ఉందని వార్తలు వస్తున్నాయి. మరి మేనేజ్‌మెంట్ సెహ్వాగ్ అన్నట్లుగా హార్దిక్‌ను వదిలేస్తుందా లేక విభేదాలను సెట్ చేసి మళ్ళీ ఆయనకే పగ్గాలు ఇస్తుందా అన్నది వేచి చూడాలి.

## తనను తానే ట్రోల్ చేసుకున్న రోహిత్ శర్మ

**బలగం టీవీ, హైదరాబాద్**



రాయ్‌పుర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌పై గెలిచిన తర్వాత ముంబయి ఇండియన్స్ స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇది టీమ్‌మేట్స్?కు నవ్వు తెప్పించింది. ఇందులో మరీ ముఖ్యంగా రోహిత్ తనను తాను స్వయంగా ట్రోల్ చేసుకున్నాడు. దీనికి సంబంధించిన వీడియోను ముంబయి ఇండియన్స్ ఎక్స్‌లో షేర్ చేసింది. మ్యాచ్? అనంతరం జట్టు డ్రెస్సింగ్ రూమ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రోహిత్ మాట్లాడాడు. తనదైన శైలిలో రోహిత్ ఫన్నీ సెటైర్లు పేల్చడం అందరికీ నవ్వు తెప్పించింది. ఈ క్రమంలోనే తన బ్యాటింగ్?పై తానే ట్రోల్ చేసుకున్నాడు. ఈ మ్యాచ్?లో అందరూ తమవంతు కృషి చేశారని, ఈ విజయం సంపూర్ణ జట్టు కృషి అని అన్నాడు. అయితే తాను ఈ మ్యాచ్?లో తాను టెస్టు ఇన్నింగ్స్ ఆడుతూ ఎంజాయ్ చేస్తుంటే, మిగిలిన వాళ్లు తమవంతు సహకారం అందించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారని అన్నాడు.'ఇది అద్భుతమైన విజయం! బ్యాటింగ్‌లో ఇది పూర్తిగా ఒక టీమ్?గేమ్. నేను మాత్రం నా టెస్టు క్రికెట్‌ను ఆస్వాదిస్తుండగా, జట్టులోని ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయడం చాలా సంతోషంగా ఉంది' అని రోహిత్ అన్నాడు. అయితే రోహిత్ ఈ మ్యాచ్?లో 26 బంతులు ఆడి కేవలం 25 పరుగులే చేశాడు. స్ట్రైక్ రేట్ 96 మాత్రమే. దీంతో ఇలాంటి స్లో ఇన్నింగ్స్ ఆడినందుకు రోహిత్ తనపై తానే సెటైర్ పేల్చుకున్నాడన్నమాట! ఇది చూసిన నెటిజన్లు 'హిట్?మ్యాన్ తనను తానే ట్రోల్ చేసుకుంటున్నాడు' అంటూ కామెంట్లు పెడుతున్నారు. 201 పరుగులు లక్ష్యాన్ని ముంబయి 19.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తిలక్ వర్మ (75 పరుగులు, 33 బంతుల్లో), రికెల్టన్ (48 పరుగులు, 23 బంతుల్లో), విల్ జాక్స్ (25 పరుగులు, 10 బంతుల్లో) రఫ్ఫాడించగా, రోహిత్ శర్మ (25 పరుగులు, 26 బంతుల్లో), రూథర్?ఫోర్డ్ (20 పరుగులు, 21 బంతుల్లో) రాణించి జట్టు విజయంలో తలో చేయి వేశారు. బౌలింగ్?లో శార్దూల్ ఠాకూర్ 4, దీపక్ చాహర్, కార్బిన్ బోశ్, రాజ్ బవ తలో 1 వికెట్ దక్కించుకున్నారు.

## గాయంతో జేమీ ఓవర్టన్ అవుట్..

**యువ ఆల్రౌండర్ డియాన్ ఫారెస్టర్ రాక**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐదుసార్లు ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ ప్రస్తుత 2026 సీజన్‌లో గాయాల సమస్యలతో సతమతమవుతోంది. ఈ క్రమంలోనే జట్టులో మరో కీలక మార్పు చోటుచేసుకుంది. ఈ సీజన్‌లో టీమ్ తరపున సెకండ్ హయ్యెస్ట్ వికెట్ టేకర్ గా ఉన్న ఇంగ్లాండ్ స్టార్ జేమీ ఓవర్టన్ కుడి తొడ గాయం కారణంగా టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. ఓవర్టన్ స్థానంలో సౌతాఫ్రికాకు చెందిన యువ ఆల్రౌండర్ డియాన్ ఫారెస్టర్‌ను సీఎస్కే మేనేజ్మెంట్ గురువారం ఒప్పందం చేసుకుంది. ఫారెస్టర్‌ను రూ. 75 లక్షల బేస్ ప్రైస్ కింద ఐపీఎల్ బృందంలోకి చేర్చుకున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. 32 ఏళ్ల జేమీ ఓవర్టన్ ఈ సీజన్‌లో చెన్నై విజయాలో చాలా కీలక పాత్ర పోషించాడు. ఆడిన 10 మ్యాచ్‌ల్లో ఏకంగా 14 వికెట్లు తీయడమే కాకుండా బ్యాటింగ్‌లో కూడా 136 పరుగులు చేశాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్ లో 45 యావరేజ్ తో వెయ్యికి పైగా పరుగులు చేసిన రికార్డు అతనికి ఉంది. టీ20ల్లో 140కి పైగా స్ట్రైక్ రేట్ తో బ్యాటింగ్ చేయగలడు. మే 11న లక్నోతో జరిగిన మ్యాచ్‌లో 3/36 వికెట్లతో చెలరేగి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు కూడా అందుకున్నాడు. అయితే గాయం తీవ్రత పెరగడంతో తదుపరి చికిత్స కోసం ఓవర్టన్ తన స్వదేశమైన ఇంగ్లాండ్‌కు బయలుదేరాడు. ఒక మంచి ఫామ్ లో ఉన్న ఆల్రౌండర్ ను కోల్పోవడం సీఎస్కే కు తీరని లోటు అని చెప్పవచ్చు.